నాట్య ప్రదక్షిణ..



నృత్యం చేస్తూ కదులుతున్న భవ్యహాసిని

సాధారణంగా భక్తులు నడుస్తూ గిరిప్రదక్షిణ చేస్తారు. కానీ నెల్లూరు జిల్లాకు చెందిన భవ్య హాసిని.. నాట్యం చేస్తూ గిరిప్రదక్షిణ చేసి ప్రత్యేకత చాటుకుంది. దసరా ఉత్సవాలు పురస్కరించుకుని భరత నాట్యం చేస్తూ అమ్మవారికి నీరాజనం పలకాలని సంకల్పించింది. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున ఇంద్రకీలాద్రి చుట్టూ సుమారు 8.01 కిలోమీటర్లు నృత్యం చేస్తూ ప్రదక్షిణ చేసింది. గతంలో ఇలాగే 14 కిలోమీటర్లు భరత నాట్యం చేస్తూ అరుణాచలం గిరిప్రదక్షిణ పూర్తి చేయడం విశేషం. ఇదే తరహాలో నరసింహ స్వామి కొండపైకి ఎక్కి మొక్కు తీర్చుకుంది. ప్రస్తుతం ఈ బాలిక నెల్లూరులో 9వ తరగతి చదువుతోంది. – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

22న కృష్ణానదీ తీరాన డ్రోన్ షో



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏపీ మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, కలెక్టర్ సృజన

భవానీపురం, న్యూస్‌టుడే : కృష్ణానదీ తీరాన కనువిందు చేసేలా ఈ నెల 22న డ్రోన్ షో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీ మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, కలెక్టర్ సృజన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం భవానీపురం పున్నమిఘాట్ వద్ద అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఇతర ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. ఏపీని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ షోతో పాటు లేజర్ లైట్ అండ్ సౌండ్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జేసీ నిధిమీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీ గౌతమి శాలి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ రైతుల ఖాతాల్లో...

వార్షిక కౌలు జమ

- తొలి విడతగా రూ. 22.03 కోట్లు
- వైకాపా హయాంలో మూడేళ్ల పాటు పెండింగ్
- సీఐడీ విచారణ పేరుతో కాలయాపన

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తుళ్లూరు: రాజధానిలోని అసైన్డ్ రైతుల బ్యాంకు ఖాతాల్లో వార్షిక కౌలు జమైంది. సీఐడీ క్లియరెన్సు ఇచ్చిన రైతుల వివరాలు పరిశీలించిన సీఆర్డీఏ అధికారులు ఆ మొత్తాన్ని జమ చేయించారు. గత మూడేళ్లుగా వైకాపా సర్కారు కారణంగా కౌలు రాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మూడేళ్ల కౌలు పడడంతో ఊరట లభించింది. సీఐడీ విచారణ పేరుతో జగన్ ప్రభుత్వం అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. అసైన్డ్ రైతుల సమస్యలను పరిష్కరించాలని సీఆర్డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి విడతలో ఇటీవల పలువురు అర్హులను గుర్తించి వారికి మంజూరు చేశారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి వచ్చే రెండు, మూడు నెలల్లో పరిష్కరించి న్యాయం చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ తెలిపారు.



మూడేళ్లు నరకం అనుభవించారు

రాజధానిలో భూముల విషయంలో కుంభకోణం జరిగిందని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. 2014 - 19 మధ్య కాలంలో జరిగిన అసైన్డ్ భూముల లావాదేవీలపై విచారణ చేస్తోంది. ఈ నేపథ్యంలో అప్పటి వైకాపా ప్రభుత్వం 2021 నుంచి అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. రాజధాని నిర్మాణం కోసం సమీకరణ కింద వచ్చిన భూముల్లో ఆరు విభాగాలకు చెందిన 3 వేల మందికి సంబంధించి 2,689.14 ఎకరాల మేర అసైన్డ్ భూములున్నాయి. దర్యాప్తు ఇప్పటికే చాలా వరకు పూర్తయినా, మళ్లీ సీఐడీ అధికారులు తిరగదోడారు. దీనివల్ల జగన్ హయాంలో ఎస్సీ రైతులకు జీవనాధారం కరవైంది. కౌలు ఎప్పుడు వేస్తారోనని కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూశారు. 3,139 మంది అసైన్డ్ రైతుల్లో కౌలుకు అర్హులంటూ 2,472 మందిని గుర్తించారు. వారికీ కౌలు ఇవ్వకుండా ప్రభుత్వం పక్కన పెట్టేసింది.

1,234 మంది రైతులకు..

సమస్యలు లేని అసలు పత్రాలతో సరిపోలిన 1,479 అసైన్డ్ రైతుల వివరాలను గుంటూరు కలెక్టర్ కార్యాలయం నుంచి సీఆర్డీఏ సేకరించింది. అధికారులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి 1, 2, 3 కేటగిరీల్లో వివాదాల్లేని 1,328.17 ఎకరాలకు సంబంధించి 1,234 మంది అసైన్డ్ రైతులను అర్హులుగా గుర్తించారు. వీరిని కౌలు చెల్లింపునకు అర్హులుగా గుర్తించి, జమ చేస్తున్నట్లు సీఐడీ, గుంటూరు కలెక్టర్, ప్రభుత్వానికి సీఆర్డీఏ అధికారులు సమాచారం ఇచ్చారు. వారి నుంచి ఎన్వోసీలు తీసుకున్నారు. వీరికి సంబంధించి రూ. 22.03 కోట్లకు బిల్లులను ఇటీవల సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేశారు. ఇది ఆర్థిక శాఖ ఆమోదం లభించడంతో రైతుల ఖాతాల్లో జమయ్యాయి. సీఐడీ అధికారులు తిరస్కరించిన జాబితాలో ఉన్న మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు సీఆర్డీఏ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇవి రెండు, మూడు నెలల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది..

ఫుల్లుగా ఆదాయం



- లైసెన్సు ఫీజు రూపంలో రెండేళ్లలో రూ.149.83 కోట్లు
- దరఖాస్తు రుసుము ద్వారా రూ.116.50 కోట్లు అదనం
- నేటి నుంచి తెరుచుకోనున్న ప్రైవేటు దుకాణాలు

ఈనాడు, అమరావతి

లాటరీలో మద్యం దుకాణాలు చేజిక్కించుకున్న వారు ప్రాంగణాలను చూసుకునే పనిలో పడ్డారు. ఎన్టీఆర్ జిల్లాలో అద్దెకు షాపుల కోసం తీవ్రంగా వెతుకుతున్నారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖ 113 దుకాణాలను నోటిఫై చేసి లాటరీ తీసి కేటాయించింది. బుధవారం నుంచి వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ముఖ్యంగా విజయవాడ నగరంలో చాలా మందికి ఇప్పటికిప్పుడు అద్దెకు దొరకలేదు. కొందరు దరఖాస్తులు వేసినప్పుడే ముందస్తుగా మాట్లాడుకుని పెట్టుకున్నారు. ఇటువంటి వారు 16వ తేదీ నుంచి షాపులు ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. బుధవారానికి అన్ని షాపులు తెరుచుకోవడం కష్టమే. ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలు, కళాశాలలు, ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రులకు వంద మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. పైగా నిబంధనల మేరకు చాలా చోట్ల దొరకడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అద్దెలు ఎక్కువగా ఉండడంతో వెనుకంజ వేస్తున్నారు. సిండికేట్‌తో సంబంధం లేకుండా సొంతంగా షాపులు దక్కించుకున్నవారు తమ లైసెన్సులను ఇతరులకు ఇచ్చేందుకు బేరసారాలు జరుపుతున్నారు. రూ. కోటి చెబుతున్నారు. ఇంత మొత్తం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. చాలా షాపులు చేతులు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎన్టీఆర్ జిల్లాలో దుకాణదారులు చెల్లించిన మొదటి విడత రుసుము (రూపాయల్లో)..

ఎక్సైజ్ స్టేషన్	షాపులు	జమ అయిన రుసుము
విజయవాడ తూర్పు	18	2,55,00,006
విజయవాడ పశ్చిమ	18	2,55,00,006
భవానీపురం	18	2,35,00,000
మైలవరం	10	1,05,00,000
నందిగామ	16	1,60,00,000
కంచికచర్ల	07	72,50,000
జగ్గయ్యపేట	10	1,08,33,333
తిరువూరు	16	1,63,33,333
మొత్తం	113	13,54,16,678

మూతపడిన ప్రభుత్వ దుకాణాలు

కొత్త మద్యం విధానంలో భాగంగా కూటమి ప్రభుత్వం పూర్వ పద్ధతిలో ప్రైవేటు దుకాణాలకు అనుమతి ఇచ్చింది. ఇప్పటి వరకు నడుస్తున్న ప్రభుత్వ షాపులు మంగళవారంతో మూతపడ్డాయి. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 102 ప్రభుత్వ దుకాణాలు, 7 వాకిన్ స్టోర్లు ఉన్నాయి. ఇవన్నీ మంగళవారం రాత్రి 9 గంటలకు మూసివేశారు. వీటిలోని సరకును వ్యాపార సమయం ముగిసిన తర్వాత మద్యం డిపోల అధికారులు, సిబ్బంది లెక్కించారు. సరకును బుధవారం ఉదయం నుంచి సాయంత్రంలోగా సంబంధిత డిపోలకు చేరుస్తారు. వాకిన్ స్టోర్లలోని సరకును తరలిస్తారు. ప్రైవేటు షాపులు తెరిచినా తెరవకపోయినా ప్రభుత్వ దుకాణాలను అన్నిచోట్లా మూసివేశారు.

తాత్కాలిక లైసెన్సులు మంజూరు

షాపులు దక్కించుకున్నవారు నిబంధనల ప్రకారం వార్షిక లైసెన్సు రుసుములో ఆరోవంతు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. 113 మంది ఈ మేరకు మొదటి విడత రుసుము చెల్లించారు. మొత్తం దుకాణాలకు సంబంధించి రూ.13.54 కోట్లు జమ అయింది. దుకాణదారులు ఈ మొత్తాన్ని చెల్లించడంతో తాత్కాలిక లైసెన్సు జారీ చేశారు. ఇది ఈ నెల 22వ తేదీ వరకు అమలులో ఉంటుంది. షాపులను అద్దెకు తీసుకున్న తర్వాత రెండేళ్ల పాటు అమలులో ఉండే పూర్తి స్థాయి లైసెన్సు ఇస్తారు.

కాసుల గలగల..

ప్రైవేటు మద్యం దుకాణాల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది. లైసెన్సు రుసుము రూపంలో జిల్లాలోని మద్యం దుకాణాల నుంచి రెండేళ్ల కాలానికి రూ.149.83 కోట్లు జమకానుంది. ఇప్పటికే దరఖాస్తుల ఫీజు రూపంలో భారీగా రూ.116.50 కోట్లు వచ్చింది. వార్షిక లైసెన్సు ఫీజుకు ఇది అదనం. లైసెన్సు ఫీజులో మొదటి విడత రూపంలో రూ.13.53 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. మొదటి సంవత్సరానికి రూ.71.35 కోట్లు, రెండో సంవత్సరంలో రూ.78.48 కోట్ల మేర ఆదాయం సమకూరనుంది. దరఖాస్తు రుసుము కూడా కలిపి మొత్తం రూ.266.33 కోట్లు ఎన్టీఆర్ జిల్లా నుంచి ప్రభుత్వానికి దక్కనుంది.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



గొల్లపూడిలో కాలిపోతున్న కారు

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్-65పై గొల్లపూడి పెట్రోలు బంకు సమీపంలో మంగళవారం ఉదయం కారు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి.. గుంటుపల్లి రమేష్ నగర్‌కు చెందిన కె.సురేంద్ర ఎన్టీపీఎస్‌లోని అగ్నిమాపక విభాగంలో పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం గొల్లపూడిలోని పెట్రోల్ బంకులో డీజిల్ కొట్టించుకొని బయటకు వచ్చిన వెంటనే కారు నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో పెట్రోలు బంకులోని మంటలను నిరోధించే పరికరాలతో ఆర్పారు. కొద్దిసేపటికి కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. షార్ట్ సర్క్యూట్ కావడంతోనే ప్రమాదం జరిగినట్లుగా భావిస్తున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్యకుమార్

కృష్ణా జిల్లాకు వాసంశెట్టి సుభాష్

ఈనాడు, అమరావతి

జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను ప్రభుత్వం నియమించడంతో అభివృద్ధిపై సమీక్షలకు అవకాశం ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా జిల్లాకు ఇద్దరు యువ మంత్రుల నియామకంతో ప్రజా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్యాశాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను నియమించారు. కృష్ణా జిల్లాకు కార్మిక సంక్షేమశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను నియమించారు. ఇద్దరూ తొలిసారి చట్ట సభలకు ఎన్నికై మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి మంత్రికి కేటాయించే ప్రత్యేక నిధుల ద్వారా జిల్లాలో అభివృద్ధి పథకాలు చేపట్టే అవకాశం ఉంది.



సత్యకుమార్

ధర్మవరం నుంచి తొలిసారి..

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వై.సత్యకుమార్ యాదవ్.. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికయ్యారు. ఎన్డీఏ మిత్ర పక్షం భాజపా నుంచి ఆయన గెలుపొంది... మంత్రి వర్గంలో స్థానం సంపాదించారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన ఉన్నత విద్యను అభ్యసించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు వద్ద 1993 నుంచి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసేవారు. ఉపరాష్ట్రపతి వద్ద ఓఎస్డీగా కొంత కాలం పనిచేశారు. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, అండమాన్ నికోబార్ రాష్ట్రాలకు పార్టీ ఇంఛార్జిగా పనిచేశారు. 2024 ఎన్నికల్లో తొలిసారి ఎన్డీఏ అభ్యర్థిగా ధర్మవరం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. వైద్యారోగ్య శాఖ మంత్రిగా నిత్యం తనిఖీలు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన

కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా వాసంశెట్టి సుభాష్‌ను నియమించారు. ఆయన కార్మిక సంక్షేమం, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రాపురం నియోజకవర్గం నుంచి ఆయన తెదేపా తరపున విజయం సాధించారు. అంతకు ముందు సుభాష్ వైకాపాలో కొనసాగేవారు. 2024 జనవరిలో చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు. వైకాపా యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. అమలాపురం అల్లర్ల వ్యవహారంలో పార్టీతో విభేదించి తెదేపాలో చేరారు. ఆయనకు కృష్ణా జిల్లా బాధ్యతలు అప్పగించారు. కృష్ణా జిల్లాకు చెందిన గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్రను అనకాపల్లి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించనున్నారు. ఎన్టీఆర్, కృష్ణా రెండు జిల్లాలు కీలకంగా మారనున్నాయి.



సుభాష్

మాకేదీ పరిహారం..!



- ఇప్పటికే బాధితులకు రూ.286.46 కోట్లు జమ
- ఇంకా కుప్పలుతెప్పలుగా అందుతున్న దరఖాస్తులు

ఈనాడు, అమరావతి

బుడమేరు వరద ముంచెత్తిన ఇళ్లకు పరిహారం అందించడం ప్రహసనంగా మారింది. ఇప్పటికే దాదాపు రూ.188.80 కోట్ల పరిహారం పంపిణీ చేయగా ఇంకా అందలేదని అధికారుల చుట్టూ తిరిగేవారు ఎక్కువగా ఉన్నారు. బుడమేరు వరదలకు, వర్షాలకు దాదాపు రూ.286.46 కోట్ల పరిహారం ప్రభుత్వం అందించింది. ఇది ఓ రికార్డుగా అధికారులు చెబుతున్నారు. ఇళ్లలో బురద ఆరకముందే పరిహారం ఖాతాలో జమ అయ్యాయి. ఇటీవల వివిధ కారణాలతో బ్యాంకులో జమ కాని ఖాతాలకు 7,164 మందికి పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. అయినా కుప్పలు తెప్పలుగా అర్జీలు వస్తున్నాయి.

అధికారుల విస్మయం..

రీఎన్యూమరేషన్ జరగాలనే డిమాండ్ లేవనెత్తుతున్నారు. ఇన్ని రోజుల తర్వాత రీఎన్యూమరేషన్ డిమాండ్ రావడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు ఎన్యూమరేషన్ ప్రక్రియ జరిగింది. నిబంధనలను అనుసరించి జీవో ప్రకారం అర్హుల గుర్తింపు సచివాలయాల పరిధిలో సిబ్బంది ఆధ్వర్యంలో జరిగాయి. దీనిపై మరోసారి రీవెరిఫికేషన్ పేరుతో ఇతర ప్రాంతాల తహసీల్దారు ఆధ్వర్యంలో జరిగాయి. ప్రస్తుతం కలెక్టరేట్‌లో మరో 21వేల దరఖాస్తులు పరిశీలనకు వచ్చాయి. ముంపు ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు ఏమాత్రం ధ్రువీకరణ లేని దరఖాస్తులే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.

బుడమేరు వరదలకు అందించిన పరిహారం..

	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
మునిగిన ఇళ్లు	89,616	188.8050
ఎంఎస్ఎంఈ	6130	18.9375
వాహనాలు	42,742	16.6212
వ్యవసాయ రంగం	32,983	55.6006
పశువులు	196	1.4636
మత్స్యశాఖ	481	0.7835
చేనేత	02	0.0050
ఉద్యానవనం	2321	4.2435
మొత్తం	1,74,471	286.4601

ఇదీ జరిగింది..

- ఆగస్టు 30, 31 తేదీల్లో కురిసిన వర్షాలకు బుడమేరు వరద ఆకస్మికంగా పొంగి విజయవాడ నగరాన్ని ముంచెత్తిన విషయం తెలిసిందే. దాదాపు 10 రోజుల పాటు అధికార యంత్రాంగం కృషి చేసి వరద నుంచి నగరాన్ని గట్టెక్కించారు. విజయవాడ సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో 179 సచివాలయాలపై ప్రభావం చూపింది.
- విజయవాడ గ్రామీణ మండలంలోని పలు గ్రామాలతో పాటు ఈ ప్రాంతంలోని ఇళ్లను ముంచెత్తాయి. పూర్తిగా మునిగిన గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ.25వేలు, మొదటి అంతస్తుకు రూ.10వేల పరిహారం సీఎం ప్రకటించి అమలు పరిచారు. ఇప్పటికే 89,616 మందికి ఇవ్వగా ఇంకా తమ ప్రాంతంలో ఇవ్వలేదని దరఖాస్తులు అందుతున్నాయి. తమ ఇళ్లకు ఎన్యూమరేషన్ కోసం బృందాలు రాలేదని కొంతమంది ధర్నా చేసిన విషయం తెలిసిందే.
- నిబంధనల ప్రకారం ఒక్క రోజు మాత్రమే ముంపులో ఉంటే పరిహారం రాదని ప్రభుత్వం స్పష్టంగా జీవోలో పేర్కొంది. అలాంటి డివిజన్లలో ఎన్యూమరేషన్ జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు నీట మునగలేదు. కానీ మునిగినట్లు కొంతమంది దరఖాస్తులు ఇస్తున్నారు. వీటిని అధికారులు నిగ్గు తేల్చుతున్నా పరిహారం రాలేదని అర్జీలు అందిస్తున్నారు.
- ఒక ఇంటిలో ఒక కుటుంబానికి మాత్రమే పరిహారం ఇస్తున్నారు. అయితే ఒకే పోర్షన్‌లో మూడు కుటుంబాలు ఉంటున్నట్లు అర్జీలు ఇస్తున్నారు. తాము వేర్వేరు అంటూ దరఖాస్తులు చేస్తున్నారు. వీటిపై విచారణ జరిపి ధ్రువీకరిస్తున్నా మళ్లీ అర్జీలు అందుతూనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలాంటి దరఖాస్తులు కలెక్టరేట్‌కు 21వేల వరకు అందాయి.

దళారుల ప్రమేయం..

నీట మునిగిన ప్రాంతంలో ఇళ్లలో నివాసం ఉంటున్నట్లు ధ్రువీకరణ చూపించాల్సి ఉంది. దీనికి రేషన్ కార్డు మ్యాపింగ్, విద్యుత్తు బిల్లు, రెంటల్ స్లిప్, ఇతర ఆధారాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎలాంటి ఆధారాలు లేకుండా ఎక్కడికెక్కడి నుంచో వచ్చినవారు అర్జీలు ఇస్తున్నారని తెలిసింది. కొంత మంది దళారులు ప్రవేశించి తాము పరిహారం ఇప్పిస్తామంటూ మోసం చేస్తున్నారు. పూర్తిగా మునిగిన ఇంటికి రూ.25వేలు, మొదటిఫ్లోర్‌కు 10వేలతో పాటు వాహనాలు, తోపుడు బండ్లకు పరిహారం ఇస్తున్న విషయం తెలిసిందే. దీన్ని దక్కించుకునేందుకు అధికంగా బోగస్ దరఖాస్తులు వస్తున్నాయి.

ఆధారాలు లేకపోతే తీసుకోం..

ఎలాంటి ఆధారాలు లేనివాటిని పరిగణనలోకి తీసుకోం. పెండింగ్‌లో పడిన ఖాతాలకు సొమ్ము జమ చేశాం. ఇంకా మరో 3వేల వరకు ఉండే అవకాశం ఉంది. మిగలిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉంది. దళారులను నమ్మి మోసపోవద్దు.

- సృజన, కలెక్టర్

భారతీనగర్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో సీఐడీ విచారణ

చిలకలూరిపేట గ్రామీణ, కరెన్సీనగర్, న్యూస్‌టుడే : చిలకలూరిపేటలో సోమవారం నుంచి బాధితులకు తిరిగి నగదు చెల్లింపులు ప్రారంభించిన బ్యాంకు అధికారులు మంగళవారం కొనసాగించారు. రెండు రోజుల్లో పది మంది బాధితులకు చెల్లింపులు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంకుల్లో విచారించిన సీఐడీ అధికారులు మంగళవారం విజయవాడ భారతీనగర్ బ్రాంచిలో విచారణ చేపట్టారు. సీఐడీ అదనపు ఎస్పీ ఆదినారాయణ, సీఐ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలోని పది మంది బృందం భారతీనగర్ బ్రాంచి మేనేజర్, డిప్యూటీ మేనేజర్లను విచారించింది. ఇక్కడ 11 మంది బాధితులను గుర్తించగా 9 మందిని విచారించారు. మరో వైపు సీఐడీ అధికారులు గత మేనేజర్ నరేష్ సెల్ఫీ వీడియో విడుదల చేసిన నేపథ్యంలో అందులో పేర్కొన్నవారిని కూడా విచారించి మొత్తం వివరాలు రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.

బీడీఎస్ యాజమాన్య సీట్లకు ఆప్షన్లు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం ప్రకటన జారీ చేసింది. ఈ నెల 15వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 17వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఆప్షన్లు పెట్టుకోడానికి అవకాశం కల్పించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం ప్రాధాన్య క్రమాన్ని విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రైవేటు దంత కళాశాలల్లో 'బి1' కేటగిరీలో 64, 'బి2' కేటగిరీలో 390, 'సి' కేటగిరీలో (ఎన్నారై కోటా) 196 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ సమీపంలోని నిమ్రా మైనార్టీ దంత కళాశాలలో 'బి' కేటగిరీలో 35, 'సి' కేటగిరీలో 15 సీట్లున్నాయి.

ఎంబీబీఎస్ క్రీడా కేటగిరీ సీట్ల కేటాయింపు

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ క్రీడా విభాగం సీట్లను మంగళవారం విశ్వవిద్యాలయం కేటాయించింది. మొత్తం 19 సీట్లను క్రీడా విభాగానికి కేటాయించారు. ఇంకా ఎన్‌సీసీ విభాగం ప్రాధాన్య క్రమం విడుదల కాలేదు. దాని కోసం తల్లిదండ్రులు, అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

'ఎన్డీయే ప్రభుత్వంపై బురద చల్లుతున్న జగన్'

భవానీపురం, న్యూస్‌టుడే : బురదలో దిగి వరద బాధితులను పరామర్శించని వైకాపా అధినేత జగన్ ఎన్డీయే ప్రభుత్వంపై మాత్రం బురద చల్లుతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. ఇన్ఫోసిస్, సుజనా ఫౌండేషన్లు, రామకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరకులను అందించే కార్యక్రమం స్థానిక ఎన్డీయే కార్యాలయంలో మంగళవారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడు ఇళ్లలో ఉన్న వైకాపా నాయకులు ప్రస్తుతం అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. వరద బాధితులను పరామర్శించకుండా జైళ్లలో ఉన్న ఆ పార్టీ నేతలు పిన్నెల్లి, నందిగం సురేష్‌లను పరామర్శించేందుకు కారాగారాలకు వెళ్లారన్నారు. వరద బాధితులకు జగన్ కోటి రూపాయలు ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వైకాపా నాయకులపై విమర్శలు చేసేందుకు తాను ఇక్కడకు రాలేదని వాస్తవాలు మాట్లాడుతున్నానని చెప్పారు. రామకృష్ణ సేవాశ్రమ అధ్యక్షుడు జపానంద స్వామీజీ, భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, ఇన్ఫోసిస్ వైస్ ఛాన్సలర్ వెంకటేశ్వర్లు, భాజపా నాయకులు కుమార స్వామి, బాజీ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరకుల సంచులను ఇస్తున్న మంత్రి సత్యకుమార్

పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వే సిబ్బంది పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ కోరారు. 'స్వచ్ఛ పక్వాడ' కార్యక్రమాన్ని విజయవాడ డివిజన్ వ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి 15 వరకు విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. మంగళవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ వ్యాప్తంగా 149 రైల్వే స్టేషన్లలో నిర్వహించామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొత్తం 12 వేల మొక్కలను నాటడం జరిగిందని వివరించారు. పరిసరాలను శుభ్రం చేసి 600 టన్నుల చెత్తను తొలగించినట్లు చెప్పారు. అలాగే 200లకు పైగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామని, ప్రత్యేక క్లీనింగ్ డ్రైవ్‌లో భాగంగా డివిజన్ వ్యాప్తంగా రైల్వేస్టేషన్లలోని స్టాళ్లు, క్యాంటీన్లు, ప్యాంట్రీకార్లు, రైళ్లను శుభ్రం చేసినట్లు పేర్కొన్నారు. సఫాయి మిత్ర, సురక్ష షివిర్ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి 1050 మంది రైల్వే, కాంట్రాక్ట్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఏడీఆర్ఎం ఎడ్విన్, సీనియర్ డీఈఎన్(హెచ్ఎం) కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

సృజన అబ్బురం!

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు
వీఆర్ సిద్ధార్థ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో

ఈనాడు డిజిటల్, అమరావతి

అందరి లక్ష్యం ఒక్కటే.. ప్రజలకు మేలైన, సులువైన సేవలు అందించడం. సమాజానికి ప్రయోజనం చేకూర్చడం. కొత్త పద్ధతిలో ప్రయోగాలు చేయడం. తక్కువ ఖర్చుతోనే అవసరాలు తీర్చుకోవడం. ఇలాంటి ఎన్నో వినూత్న ప్రయోగాలకు వేదికగా నిలిచింది.. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఇక్కడ 'సైన్స్ ఎక్స్‌పో' నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ సృజనతో ఆకట్టుకున్నారు. సందర్శకులను ఆలోచింపజేశారు.


ప్రయోగాలు వివరిస్తున్న విద్యార్థులు

తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణం



3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా తక్కువ ఖర్చుతో ఇల్లు నిర్మించుకోవచ్చు. 3డీ కాంక్రీట్ దిమ్మెలను సిమెంట్, ఇసుక, ధూళి, బూడిదతో తయారు చేస్తాం. కార్మికుల శక్తి తక్కువ అవసరం అవుతుంది. పునాది దశలో తప్ప.. మిగిలిన ఇంటి నిర్మాణంలో అంతగా ఇనుము వినియోగించాల్సిన అవసరం ఉండదు. సాధారణంగా ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చులో 40శాతం సొమ్ముతో 3డీ ఇంటిని నిర్మిస్తున్నాం. ఈ పద్ధతిలో వీఆర్ సిద్ధార్థ కళాశాలలో నిర్మాణం చేపడుతున్నాం.

– ఫర్హాన, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల

అత్యవసర విభాగాల్లో డ్రోన్ సేవలు



ప్రస్తుతం డ్రోన్ల వినియోగం విపరీతంగా పెరిగింది. కానీ.. కీలక రంగాలైన ఆరోగ్య, రక్షణ, నిఘా, ట్రాఫిక్, విపత్తు నిర్వహణల్లో వాటి వినియోగం లేదు. ఆయా రంగాల్లో క్లిష్టమైన పనులను సులువుగా చేసేలా.. స్వదేశీ పరిజ్ఞానంతో డ్రోన్లను తయారు చేశాం. వరదలు వచ్చినప్పుడు ముంపులో ఉన్న ప్రజలను గుర్తించవచ్చు. వారికి ఆహారం, మంచినీరు అందించవచ్చు. ట్రాఫిక్ సమస్యలు తొలగించవచ్చు.

– రాజేశ్వరి, ప్రవీణ్ కుమార్, ఇంజినీరింగ్ రెండో ఏడాది, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల

రూ.29 వేలకే ఈ-సైకిల్



నగరాల్లో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. సైకిల్‌కు ఎలక్ట్రికల్ బ్యాటరీ అమర్చి, ఈ-సైకిల్‌గా మార్చాం. దీని ద్వారా గాలి కాలుష్యం ఏర్పడదు. 3 గంటల విద్యుత్తు ఛార్జింగ్‌తో 40 కి.మీ ప్రయాణించవచ్చు. అర యూనిట్ మాత్రమే ఖర్చవుతుంది. పెట్రోల్ కంటే తక్కువ ఖర్చుతో ప్రయాణించవచ్చు. దీనిని తయారు చేయడానికి రూ.29 వేలు అయ్యింది. పోర్టబుల్ బ్యాటరీ సిస్టమ్ గల సైకిల్‌ను తయారు చేయడానికి ప్రయోగాలు చేస్తున్నాం.

– అవినాష్, కృష్ణ, వీఆర్ సిద్ధార్థ

చెరువుల వద్దే.. రొయ్యల నాణ్యత



ఒక రొయ్యల చెరువు వద్ద సుమారు 25 మంది పనిచేస్తుంటారు. పెంపకం దగ్గర నుంచి అమ్మకాలు వరకు వాటి బాగోగులు చూసుకుంటారు. విక్రయాల సమయాల్లో.. వాటి నాణ్యతను నిర్ధారించుకోవడానికి చాలా మంది రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు చెప్పే ధరకే విక్రయించి నష్టపోతున్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో 'సాప్రమస్' అనే యంత్రాన్ని తయారు చేశాం. చెరువు వద్దే రొయ్యల నాణ్యత తెలుసుకోవచ్చు. మార్కెట్ ధరకే విక్రయాలు చేయవచ్చు. ఈ ప్రయోగాన్ని జాతీయ స్థాయి సైన్సు పోటీల్లోనూ ప్రదర్శించి బహుమతులు గెలుచుకున్నాం.

– హనీష్, యాసన్, వీఆర్ సిద్ధార్థ

పశుసంతతి పెంపుదలకు ప్రణాళికలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : మేలుజాతి పశువుల ఉత్పత్తి లక్ష్యంగా ప్రత్యేకంగా వీర్యం సేకరించేందుకు రూ.2 కోట్లతో ప్రణాళిక అమలు చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మండలంలోని బండిపాలెంలో సంఘం అధ్యక్షురాలు అడుసుమల్లి కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా అత్యధిక ధరను కల్పించే దిశగా కార్యాచరణ కొనసాగుతుందని చెప్పారు. గ్రామంలో అత్యధిక పాలు సరఫరా చేసే గోరంట్ల దుర్గారావు డైరీ ఫారానికి వెళ్లి మిల్క్ యూనియన్ సరఫరా చేసిన మేలుజాతి కృత్రిమ వీర్యం ద్వారా పుట్టిన దూడలను ఆయన పరిశీలించారు. జిల్లా బోర్డు డైరెక్టర్ సీహెచ్.లవయ్య, ట్రస్ట్ డైరెక్టర్ ఐ.రామారావు, వెటర్నరీ అధికారి ప్రసాద్, మేనేజర్ యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.


బండిపాలెంలో పాడి రైతులతో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

నవంబరులో శృంగేరీ జగద్గురువు రాక

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శృంగేరీ శారదా పీఠం ప్రతినిధులు మంగళవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిశారు. శృంగేరీ పీఠాధిపతి విదుశేఖర భారతి మహాస్వామి నవంబరు నెలలో చేపట్టిన విజయయాత్ర గురించి డీజీపీకి వివరించారు, స్వామియాత్రలో పాల్గొని ఆశీస్సులు పొందాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. డీజీపీని కలిసిన వారిలో గుంటూరుకు చెందిన హోమియోపతి వైద్యుడు ఓవీ రమణ తదితరులున్నారు. స్వామి నవంబరు 18 నుంచి 20 వరకు విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీశృంగేరీ పీఠ పరిపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో బస చేస్తారు. 21 నుంచి 24 వరకు గుంటూరు శ్రీశృంగేరీ పీఠంలో బస చేస్తారని, పలు కార్యక్రమాల్లో పాల్గొని అనుగ్రహభాషణలు చేస్తారని ప్రతినిధులు తెలిపారు.


డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసిన శృంగేరీ పీఠం ప్రతినిధులు

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

పటమట, న్యూస్‌టుడే: సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారని మహిళా కానిస్టేబుల్ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ వివరాల ప్రకారం.. మాచవరం స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ భవానీ నాలుగేళ్లుగా కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓపీలో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి రోల్‌కాల్ సమయంలో మంగళవారం నుంచి స్టేషన్‌లో విధులు నిర్వహించాలని భవానీని మాచవరం సీఐ ప్రకాశ్ ఆదేశించారు. డ్యూటీ డ్రెస్ కోడ్ పాటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మనస్తాపం చెందిన ఆమె ఇంటికి వెళ్లే మార్గంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉంది. మంగళవారం డీసీపీ గౌతమిశాలి స్టేషన్‌లోని మహిళా ఎస్సైలు, సిబ్బందిని విచారించి సీపీకి నివేదిక ఇచ్చారు.

20న వైజ్ఞానిక ప్రదర్శన

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 20న వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త కె.ప్రేమావతి తెలిపారు. ఈ ప్రదర్శన 6, 7, 8 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంగా, 9, 10, ఇంటర్ విద్యార్థులకు సీనియర్ విభాగంగా జరుగుతాయని వెల్లడించారు.

ఉపాధి కల్పన తరగతులు

గన్నవరం గ్రామీణం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మగ్గం, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగులు, బ్యూటీషన్, టైలరింగ్ తదితర కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం తెలిపారు. ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ తరగతుల్లో ఆసక్తిగల 18-45ఏళ్ల యువత ఆధార్, రేషన్ కార్డులతో పాటు విద్యార్హత పత్రాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63042 54730, 94900 11081 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

19న ఉద్యోగ మేళా

కరెన్సీనగర్, మాచవరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ శనివారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాకు డైకిన్ సంస్థ హాజరవుతున్నట్లు వెల్లడించారు. డిప్లమా మెకానికల్/ ప్రొడక్షన్/ ఆర్ఏసీ/ ఆటోమొబైల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ చేసిన వారు, బీఎస్సీ డిగ్రీ చదివిన 19-25 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,000 నుంచి రూ.15,000 వరకు వేతనం ఇస్తామని పేర్కొన్నారు. తమ పూర్తి వివరాలు, ఆధార్, విద్యార్హత ధ్రువ పత్రాలతో కేంద్రానికి రావాలని, పూర్తి వివరాలకు 70959 91379, 63050 04318 చరవాణిలో సంప్రదించవచ్చని వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, న్యూస్‌టుడే: జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న వన్ స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పని చేయడానికి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి సెంటర్ అడ్మినిస్ట్రేటర్, సైకో-సోషల్ కౌన్సిలర్, సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి జి.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఎన్టీఆర్.ఏపీ.జీవోవీ.ఇన్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని అన్ని ధ్రువపత్రాల నకళ్లను గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి కార్యాలయంలో అభ్యర్థులు స్వయంగా సమర్పించాలని సూచించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇస్తామని, అందుకు జ్ఞాన భూమి వెబ్‌సైట్ ద్వారా ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి మెరిట్ అభ్యర్థులకు అర్హత ప్రకారం ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తామని వెల్లడించారు.

జీవాలకు నట్టల నివారణ మందులు

విజయవాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే : ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ఎం.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2.34 లక్షల గొర్రెలు, 91999 మేకలు ఉన్నాయన్నారు. వీటన్నింటికీ స్థానిక పశు వైద్య కేంద్రాల్లో నట్టల నివారణ మందు తాగిస్తామని చెప్పారు. జీవాల పోషకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం


గంపలగూడెం: నెమలిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన పూజలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు అన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నెమలి, ఉమ్మడిదేవరపల్లి, కొణిజెర్ల, ఊటుకూరు, తునికిపాడు, దుందిరాలపాడు, పెనుగొలను, చింతలనర్వ, మేడూరు, పెదకొమిర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే సిమెంట్ రహదారుల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం నెమలి వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు సైకిళ్లు ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. ఈవోపీఆర్డీ డి.బాబూరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో వి.వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల్లో ఎన్డీయే కూటమి నాయకులు ఉన్నారు.

తిరువూరు మండలంలో నేడు

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోకిలంపాడు, మల్లేల, లక్ష్మీపురం, కాకర్ల, ఆంజనేయపురం, చిట్టేల, చౌటపల్లి, జి.కొత్తూరు, గ్రామాల్లో బుధవారం 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీవీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో నిర్మించే సిమెంట్ రహదారులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

కూటమి ప్రభుత్వంపై నమ్మకమే పల్లెల్లో పండగ

5 గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు


మైలవరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వంపై నమ్మకంతో పనులు వేగంగా జరుగుతుండడంతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పొందుగల, మొర్సుమిల్లి, పుల్లూరు, చంద్రగూడెం పంచాయతీల్లో నరేగా నిధులతో నిర్మించిన, నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, నియోజకవర్గానికి నరేగా ద్వారా రూ.22.5 కోట్ల నిధులను కేటాయించినట్లు వివరించారు. మైలవరం తారకరామా నగర్‌లో తమ రహదారిని అభివృద్ధి చేయాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేని కోరగా, అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు మంజుభార్గవి, కోటమ్మ, రమాదేవి, ఎంపీపీ ప్రసన్నరాణి, నాయకులు రామ్మోహనరావు, లితీష్, రాధాకృష్ణ, సుధాకర్, రామారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, కుమార్‌రెడ్డి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

✦ మండలంలోని పుల్లూరులో మోటారు కాలిపోవడంతో వారం రోజుల నుంచి నీటి సరఫరా కావడం లేదు. మంగళవారం 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా పుల్లూరు వెళ్లిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దృష్టికి తాగునీటి సమస్యను గ్రామస్థులు తీసుకెళ్లారు. సమస్య పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

✦ చిలుకూరివారిగూడెంలోనూ నీటి సరఫరా నిలిచిపోయింది. దీనిపై ఎంపీడీవో పి.అనురాధను సంప్రదించగా, గ్రామంలో కాలిపోయిన మోటారును బిగించే క్రమంలో ఎలక్ట్రిషియన్‌కు ఇబ్బంది కలిగిందని, మోటారు బిగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అభివృద్ధి పనులపై వినతి.. స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో పలు అభివృద్ధి పనులకు సహకరించాల్సిందిగా ఆ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎం.బాబూరావు మంగళవారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని బాబూరావు తెలిపారు.

మద్యం దుకాణాల ప్రారంభానికి సమాయత్తం

తిరువూరు, గంపలగూడెం: ప్రభుత్వ అనుమతి మేరకు మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు బుధవారం నుంచి తమకు కేటాయించిన మండలాల్లో విక్రయాలు ప్రారంభించేందుకు సమాయత్తమయ్యారు. దుకాణాలు దక్కించుకున్న వారు తమ వాటాదారులతో కలిసి మద్యం విక్రయ షాపుల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో లాటరీ ద్వారా 16 మద్యం షాపులు దక్కించుకున్న వారి వివరాలను సీఐ వీవీవీ.సత్యనారాయణవర్మ తెలిపారు.

ముగింపు నిల్వల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

తిరువూరు, న్యూస్‌టుడే: నేటి నుంచి నూతన మద్యం విధానం అమలులోకి వస్తుండడంతో తిరువూరు మండలంలోని లక్ష్మీపురంలోని మద్యం దుకాణంలో ఆర్డీవో కె. మాధవి తనిఖీ చేశారు. తిరువూరు డివిజన్‌లోని వివిధ మండలాల్లోని ఇప్పటి వరకు గల మద్యం ముగింపు నిల్వలు పరిశీలించారు. ఆమె వెంట ఎక్సైజ్ సీఐ వీవీవీఎస్ వర్మ, అధికారులు ఉన్నారు.

874 క్యూసెక్కుల సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు మంగళవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 874 క్యూసెక్కులు సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 272 క్యూసెక్కులు చేరాయి. దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు 40, పెదకొమిర 20, మధిర 10, నిదానపురం 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని 7 ఉన్నత పాఠశాలలు, కుంటముక్కలలోని అంబేడ్కర్ గురుకులాన్ని ఎంఈవో వీరాస్వామి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. చెవుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందర్శించిన సమయంలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.



బతుకమ్మల నిమజ్జనం

దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన బతుకమ్మలను భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మంగళవారం నిమజ్జనం చేశారు.
– న్యూస్‌టుడే, గంపలగూడెం

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ఇబ్రహీంపట్నం గ్రామీణం: 2024-25 విద్యా సంవత్సరంలో ఎస్జీఎఫ్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో వాలీబాల్, కబడ్డీ, షటిల్‌లో మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయికి ఇటీవల ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు. కొండపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో మూలపాడు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. వాలీబాల్ జిల్లా స్థాయికి అండర్-17(బాలురు) పదో తరగతి విద్యార్థి జాన్ వెస్లీ, అండర్-14లో (బాలికలు) యు.మేఘన, జస్వంతి, బేబి రాణి, తనిష్క, హ్యాండ్ బాల్ అండర్-14 బాలికల స్టేట్ మీట్‌కు 9వ తరగతి విద్యార్థిని యు.మేఘన ఎంపికైంది. వీరికి తర్ఫీదునిచ్చిన క్రీడా ఉపాధ్యాయుడు సురేంద్రబాబు, వహీదాబేగం, శ్రీనివాసరావులను హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా

న్యూస్‌టుడే, జి.కొండూరు

మండలంలోని బుడమేరు వాగు ఇసుక అక్రమార్కులకు వరంగా మారింది. అడ్డగోలు తవ్వకాలతో పెద్ద పెద్ద గోతుల పెట్టి నిత్యం వందలాది ట్రాక్టర్లతో రేయింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసిన విచ్చలవిడిగా తరలించి అక్రమార్జన చేస్తున్నారు. ప్రధానంగా బుడమేరు పరివాహక ప్రాంతమైన చిననందిగామలో ఈ తంతు పట్టపగలే కొనసాగుతోంది. సొంత అవసరాల కోసమంటూ ఇసుకను కొంత మంది తమ నివాసాల వద్ద, మామిడి తోటల్లోను డంప్ చేసి అక్కడ నుంచి లారీల్లో తరలిస్తున్నారు. విజయవాడ లాంటి ప్రాంతాలకు ఒక్కొక్క లారీ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూతవేటు దూరంలో ఇసుక లభ్యమవుతున్నా సామాన్యులకు ఇసుక కావాలంటే అక్రమార్కుల చెప్పిన రేటు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన కొందరు ఆవేదన చెందుతున్నారు. పోలీసు శాఖ మినహా రెవెన్యూ, జలవనరుల శాఖాధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.


చిననందిగామలో బుడమేరు నుంచి తరలిస్తున్న ట్రాక్టర్లు


కూలీలతో ట్రాక్టర్లకు లోడ్ చేయిస్తూ..

పంచాయతీలకు అప్పగింతతోనే అడ్డుకట్ట

✦ బుడమేరు పరివాహక ప్రాంతంలో నాలుగైదు గ్రామాలుండగా ఆయా గ్రామాల పరిధిలోని ఇసుకను గ్రామ పంచాయతీలకు అప్పగిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

✦ పంచాయతీలకు ఆదాయంతో పాటు వినియోగదారులకు అందుబాటు ధరలకు ఇసుక దొరుకుతుందని, ట్రాక్టర్ల యజమానులకు ఉపాధి లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు.

✦ ఇటీవల వరదలకు బుడమేరులో ఇసుక ఇబ్బడిముబ్బడిగా చేరడంతో ఇసుక కొరత లేకుండా పోయింది. ఈక్రమంలో ఇసుక మేటలు తొలగించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పంచాయతీల ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

✦ దీనిపై జి.కొండూరు ఎస్సై కె. సతీష్ కుమార్‌ను వివరణ కోరగా బుడమేరు పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చిన్ననందిగామ గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఈ-పంట నమోదు తుది గడువు 16న

నరసాపురం(విస్సన్నపేట), న్యూస్‌టుడే: ఖరీఫ్ వరిలో ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులను సరైన విధానంలో పాటిస్తే మేలైన దిగుబడులు లభిస్తాయని మండల వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని నరసాపురంలో మంగళవారం ఆమె ఆధ్వర్యంలో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో కర్షకులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ- పంట నమోదు జాబితాల సామాజిక తనిఖీ గడువు బుధవారంతో ముగుస్తుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శనగా ఉంచి జాబితాలను పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే సరిజేసేందుకు వీఏఏలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముదిరిన వంట ఏజెన్సీ వివాదం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకం మార్పు వివాదం మరింత ముదిరింది. ఏజెన్సీని మార్చి కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటూ అధికార పార్టీ నాయకులు వాదిస్తుండగా, నిబంధనలు అంగీకరించవని విద్యాశాఖాధికారులు చెప్పడంతో మంగళవారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు పాఠశాలకు వచ్చి భోజన నాణ్యతపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలు వెంకటరత్నం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జల్లి కృష్ణ, నాయకుల మధ్య వాదన చోటుచేసుకుంది. నాయకులు డబ్బులు డిమాండు చేసినట్లు ఏజెన్సీ నిర్వాహకురాలు తమపై అభాండాలు వేస్తే చూస్తు ఊరుకునేది లేదని, తల్లిదండ్రుల డిమాండు మేరకు తాము మార్పు కోరుతున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. ఇరువర్గాల మధ్య వాదన పెరుగుతుండగా, నిర్వాహకురాలిని పని ముగించుకుని వెళ్లిపోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఫిర్యాదుల నేపథ్యంలో మార్చాల్సిందేనని నాయకులు, ఉపాధ్యాయులను డిమాండు చేసి వెళ్లిపోయారు.

మంచినీటి ట్యాంకర్ ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే: తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచి నీటి సరఫరా ట్యాంకర్ వాహనాన్ని మంగళవారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. మైలవరం పట్టణంలో తాగునీటి ఎద్దడి సమయంలో ట్యాంకరును వినియోగిస్తామని లంకా లితీష్ చెప్పారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు


గొల్లపూడి: కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని


గంపలగూడెం మండలం పెనుగొలనులో..

తిరువూరు, న్యూస్‌టుడే: 'కలలు కనండి.. సాకారం చేసుకోండి' అంటూ భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం అందించిన సందేశం విద్యార్థులకు ఆచరణీయమని స్థానిక శ్రీనిధి టెక్నో పాఠశాల కరస్పాటెండెంట్ ఎం.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ ఆర్.వెంకటనారాయణ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పాఠశాలలోని ఆయన విగ్రహానికి మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి నివాళులర్పించారు.

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు.

తాతకుంట్ల(విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్లలో మంగళవారం ఎన్డీయే కూటమి, ఎస్సీ మోర్చా నాయకులు ఎల్.కొండలరావు, పి.బాబు, పి.పున్నమయ్య, కె.శ్రీనివాసరావు, పి.హరీష్, కె.ప్రకాశ్ తదితరుల ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పించారు.

గొల్లపూడి: యువతకు 'కలలు కని వాటిని సాకారం చేసుకోండి' అంటూ మాజీ రాష్ట్రపతి, అణు శాస్త్రవేత్త అబ్దుల్ కలాం స్ఫూర్తిని నింపారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి కలాం జయంతిని గొల్లపూడిలోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో జన్మించిన కలాం దేశ రక్షణ రంగాన్ని అగ్ర పథంలో నిలిపారన్నారు.

మైలవరం: మాజీ రాష్ట్రపతి ఏపీజే కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక 6వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్, ఉపాధ్యాయుడు మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భోజన పళ్లాలు, గ్లాసుల వితరణ.. **గోసవీడు (గంపలగూడెం):** మండలంలోని గోసవీడు, గంగదేవిపాడులో అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు భోజనం పళ్లాలు, గ్లాసులు శిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు మంగళవారం వితరణ చేశారు. తొలుత సభ్యులు శేషిరెడ్డి, వెంకటరెడ్డి, నారాయణరావు, చిన్నారులు, కార్యకర్తలు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

పంటలకు మిత్ర పురుగులతో ప్రయోజనం


చింతలపాడులో వరి పంట క్షేత్రస్థాయి పరిశీలనలో వ్యవసాయాధికారులు, రైతులు

చింతలపాడు (తిరువూరు), న్యూస్‌టుడే: అన్నదాతలు తాము సాగు చేసిన పంటల్లో మిత్ర పురుగులను గుర్తించి వాటిని సంరక్షించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకురాలు టి.మాధవీలత సూచించారు. మండలంలోని చింతలపాడులో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొని క్షేత్రస్థాయిలో వరి తదితర పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. మిశ్రమ ఎరువులు తగ్గించి సూక్ష్మ పోషకాలు అందించే సూటి ఎరువులను పంటలకు సమతులంగా అందించాలన్నారు. ఏడీఏ జి.కెనడీ, ఏవో పిట్టల పద్మ, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

కుమ్మరికుంట్ల (ఎ.కొండూరు), న్యూస్‌టుడే: పత్తి పంటలో సమగ్ర సూక్ష్మపోషక యాజమాన్యం పద్ధతులను రైతులు తప్పనిసరిగా అమలు చేయాలని డీఆర్సీ డీటీ టి.మాధవీలత స్పష్టం చేశారు. మండలంలోని కుమ్మరికుంట్లలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో అన్నదాతలతో కలిసి క్షేత్రస్థాయిలో పత్తి పంటను ఆమె పరిశీలించారు. పత్తి పంటలో మెగ్నీషియం, పొటాషియం, జింకు లోపాలను గుర్తించే లక్షణాలు, నివారణ చర్యలు, సమగ్ర సస్యరక్షణపై రైతులకు వివరించారు. ఏవో టిప్పు సుల్తాన్, ఏఈవో ఎ.రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకల్య విద్యార్థులను ప్రోత్సహించాలి


ఇబ్రహీంపట్నంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రదర్శన



విస్సన్నపేటలో అవగాహన ప్రదర్శనలో అధికారులు, విద్యార్థులు



జి.కొండూరులో ఎంఈవోలు నరసింహారావు, వీరాస్వామి తదితరులు

న్యూస్‌టుడే బృందం: అభ్యాస వైకల్యం కలిగిన విద్యార్థి పదాలు, సంఖ్యల ఉచ్ఛారణలో కలిగే ఇబ్బందులను ఉపాధ్యాయులు గుర్తించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పలువురు అధికారులు, ఎంఈవోలు తెలిపారు. డిస్లెక్సియా అవగాహన కార్యక్రమాన్ని తిరువూరు, మైలవరం పరిధిలోని పలు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు తెలివి తేటలు ఉన్నప్పటికీ రాత, జ్ఞాపక శక్తి వంటి అంశాల్లో నైపుణ్యత తక్కువగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ప్రదర్శన చేశారు.

నేత్రాలు దానం


బ్రహ్మారెడి (పాత చిత్రం)

కనుమూరు (గంపలగూడెం): మండలంలోని కనుమూరులో వజ్రాల బ్రహ్మారెడ్డి (60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. తిరువూరు లయన్స్ క్లబ్ సభ్యుడు, న్యాయవాది గోగిరెడ్డి కృష్ణారెడ్డి బ్రహ్మారెడ్డి కుమారుడు ప్రవీణ్‌రెడ్డికి నేత్రదానం ఆవశ్యకతను వివరించి అనుమతి తీసుకున్నారు. విజయవాడ నుంచి కనుమూరు చేరుకున్న వైద్యుడు రవి బ్రహ్మారెడ్డి కళ్లలోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.


పద్మజ (పాత చిత్రం)

తిరువూరు: పట్టణానికి చెందిన దారా పద్మజ (58) మంగళవారం ఆకస్మిక మృతి చెందారు. భర్త వెంకటేశ్వరరావు (బాబ్జి)కు నేత్రదానం ఆవశ్యకతను తిరువూరు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, కె.ముత్యప్రసాద్, కె.రాజేష్‌ఖన్నా, ఎన్.రాజారావు వివరించారు. సభ్యులు చొరవతో ఖమ్మం నేత్ర నిధి నుంచి వచ్చిన వైద్యులు ఆమె కళ్లలోనే కార్నియాను సేకరించి ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. భర్తను పలువురు అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు

తిరువూరు, న్యూస్‌టుడే: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించినట్లు సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ తెలిపారు. తమ కార్యాలయంలో ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పట్టభద్రులకు ఓటు ఆన్‌లైన్ నమోదు చేస్తామన్నారు. మూడేళ్ల కిందట డిగ్రీ పూర్తి చేసిన వారంతా ఓటు నమోదుకు దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నమోదు చేయొచ్చున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విస్సన్నపేట మండలం కలగర శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన బుర్రి జయరాజు (58) విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందారు. ఎస్సై సత్యనారాయణ వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం జయరాజు తన మోపెడ్‌పై తిరువూరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మల్లేల వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తలకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్సై కేసు నమోదు చేశారు.

చెరువులో మునిగి..

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని అక్కపాలెంకు వెళ్లే దారిలో ఉన్న మల్లమ్మ చెరువులో మునిగి తిరువూరులోని రాజుపేటకు చెందిన కోడే ప్రసాద్ (45) మృతి చెందారు. భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఏఎస్సై ఎండీ.షరీఫ్ కేసు నమోదు చేశారు. ఏఎస్సై వివరాల మేరకు.. గత కొంత కాలంగా ప్రసాద్‌తో అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఆదివారం ఇంటి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం చెరువు వద్ద మృతదేహం లభ్యమైంది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఉంటాడని ఆమె ఫిర్యాదులో తెలిపారన్నారు. పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

అల్పపీడనం.. భయాందోళనలో రైతులు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం


ముంపు తరువాత రెండో సారి విత్తిన మినుము

అల్పపీడన ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని పంట కాలువలు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఏనుగుగడ్డ, ఇబ్బడి వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తోన్నాయి. భారీ వానలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణానదితో పాటు వాగులు వంకలు పొంగి మండల పరిధిలో దాదాపు ఎనిమిది వేల ఎకరాలలోని వరితో పాటు వాణిజ్య వ్యాపార అపరాల పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. రైతులు భారమైన ముంపు పొలాల్లో నీటిని బయటకు పంపి తిరిగి సాగుకు అనుకూలంగా అపరాలు సాగుచేశారు. ముంపు తప్పించుకున్న వరి పంట పొట్ట దశలో ఉంది. ఈ తరుణంలో ఈదురు గాలులతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో రెండోసారి సాగు చేసిన పంటలతోపాటు ముంపును తట్టుకుని నిలబడ్డ పంటలు ఏమవుతాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక వ్యవసాయ సీజన్ కోల్పోయినట్లు అవుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అదనంగా ఖర్చు పెట్టాం..

ఒక సీజన్‌లోనే పైర్లు రెండు సార్లు ముంపునకు గురైతే ఇంకేం వ్యవసాయం చేస్తాం. ఎంతని పెట్టుబడి పెడతాం. ఇప్పటికే ఎకరాకు రూ.6 వేల వరకు అదనంగా ఖర్చు చేశాం. ఈ సారి వరద వస్తే అప్పులే మిగులుతాయి.
– డి.నాగేశ్వరరావు, చిలుకూరి

డ్రెయిన్ల నిర్వహణ అధ్వానం

గత నాలుగైదేళ్లుగా సరైన నిర్వహణ లేక డ్రెయిన్లు అధ్వానంగా తయారయ్యాయి. తొలకరికి ముందే అధికారులు పంట మురుగు కాలువలను బాగు చేయిస్తే ఇటువంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు సమస్య తగ్గుతుంది. ఇప్పుడైనా అధికారులు మురుగు కాలువలపై దృష్టి పెడితే రైతులకు మేలు.
– కోటేశ్వరరావు, రైతు, కొటికలపూడి



ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెవుటూరులో ఇటీవల సంభవించిన వరదల కారణంగా పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా ఉంది. సమస్యను సర్పంచి పిన్నిబోయిన శ్రీదేవి దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా స్పందించి మంగళవారం కాలువలు పూడిక తీయించి మురుగు పారేలా చర్యలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

☛ గుణదల పాత పంచాయతీ కార్యాలయం సాయి మెస్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ నీరు మురుగు నీరు బయటకు వస్తోందని స్థానిక నివాసి గోవర్ధన్ ఏఎం నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పూడిక తీయించారు.

? 6వ డివిజన్ రావిచెట్టు సెంటర్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీటి వల్ల కుక్కలు వ్యాధులతో బాధ పడుతున్నాయి. **- వంగపండు వేణు**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి కుక్కల నివారణ చర్యలు తీసుకుంటాం **- సోమశేఖర్, వెటర్నరీ సర్జన్**

? మాచవరం కార్మిక నగర్ చివర నుంచి బెత్లేహం నగర్‌కు వెళ్లే మార్గమంతా చెత్తతో నిండి ఉంది.**- మురళి**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం **-ద్రోణాచారి, శానిటరీ అధికారి - న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

వారధిపై నిలిచిన వాహనాలు

కృష్ణలంక: గుంటూరు వైపు నుంచి విజయవాడ వైపునకు వచ్చే కనకదుర్గమ్మ వారధిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో వారధిపై ప్రైవేటు (ట్రావెల్స్) బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోయింది. బస్సును అక్కడ నుంచి తొలగించకపోవడంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రెండు గంటల సమయం పట్టింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విజయవాడ తూర్పు

అనస్థీషియాపై అవగాహన

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: అనస్థీషియాపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలని ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్స్ రాష్ట్ర అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ పేర్కొన్నారు. అక్టోబరు 16న వరల్డ్ అనస్థీషియా డే సందర్భంగా ఐ.ఎం.ఏ. హాలులో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన గవర్నర్‌పేటలో విలేకరులతో మాట్లాడారు. శస్త్రచికిత్సల్లో అనస్థీషియా అంటే ప్రజలు భయపడుతుంటారని, వాటిని తొలగించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. సీపీఆర్‌పై వారికి అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

నష్టపోయాం.. ఆదుకోండి

అద్దెలు భరించలేక..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొండ ప్రాంత వాసులు కుదేలయ్యారు. కొండ రాళ్లు కొన్ని గృహాలపై జారిపడ్డాయి. కొన్ని ఇళ్లు పూర్తిగా, మరి కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇంట్లో సామగ్రి దెబ్బతింది. రామలింగేశ్వరనగర్, అజిత్ సింగ్‌నగర్ వరద బాధితులకు ఇచ్చినట్లు తమకు కూడా పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

తూర్పు నియోజకవర్గంలోని ఆరు, ఏడు డివిజన్లలో కొంత కొండ ప్రాంతం ఉంది. చేతివృత్తులు, రోజువారీ పనులు చేసుకుంటూ... ఆర్థిక భారం నివాసం కష్టమైనా... అద్దెలు భరించలేక కొన్నేళ్ల నుంచి కొండ ప్రాంతంలో ఉంటున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఆరో డివిజన్‌లోని గులాంమొహియిద్దీన్‌నగర్, బ్రహ్మానందరెడ్డినగర్ 2వ లైన్, ఇజ్రాయిల్ అప్పలనాయుడు వీధి తదితర ప్రాంతాల్లో కొన్ని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. కొన్ని ఇంటి గోడలు కూలిపోయాయి. పైకప్పు రేకులు, తలుపులు దెబ్బతిన్నాయి. వివిధ రూపాల్లో సుమారు 32 ఇళ్లు దెబ్బతిన్నాయని స్థానికులు చెబుతున్నారు. సర్వే బృందం మాత్రం 18 ఇళ్లకు నష్టం జరిగినట్లు నమోదు చేశారని వాపోతున్నారు. మొగల్రాజపురంలో పటమట వారి వీధి, హిల్ లేఅవుట్ చర్చి పక్క రోడ్, సున్నపుబట్టీల ప్రాంతంలో 11 ఇళ్ల వరకు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం జాబితాలో మాత్రం తమ పేర్లు లేవని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహాలు, ఇంట్లో సామగ్రి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆరో డివిజన్‌లో రాయి పడి దెబ్బతిన్న ఇల్లు (పాత చిత్రం)

అప్పు చేసి మరమ్మతులు చేయించా



వర్షాలకు కొండ పైనుంచి రాయి మా ఇంటిపైన పడింది. కొంతమేర రేకులు, నేల దెబ్బతిన్నాయి. స్నానాలదొడ్డి పాడైపోయింది. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూశాం. ఇంతవరకు పరిహారం రాలేదు. అప్పు తీసుకొని మరమ్మతులు చేయించాను. ప్రభుత్వం ఆదుకోవాలి **- డి.శ్రీను**

రూ.రెండున్నర లక్షలకు పైగా నష్టం



మారుతీనగర్ కోకోకోలా వీధిలోని కొండపై ఉంటున్నాం. వర్షాలకు మా ఇంటి రేకులపై రాయి పడింది. మేము ప్రాణాలతో బయటపడ్డాం. ఇల్లు నేలమట్టమైంది. సామగ్రి దెబ్బతింది. సుమారు రూ.2.50 లక్షల నష్టం జరిగింది. ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాం. **- పి. అప్పమ్మ**

సీఎంవోహెచ్ రత్నావళి డిప్యుటేషన్ ఉపసంహరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో చీఫ్ మెడికల్ ఆరోగ్య అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.రత్నావళి డిప్యుటేషన్ (ఫారెన్ సర్వీస్)ను ఉపసంహరించుకుంటున్నట్లు పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కె.పద్మావతి నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రకు లేఖ రాశారు. ఆమెను వెంటనే బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని కోరారు. ప్రభుత్వం మెమో జారీ చేసినందున తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆమె కోరారు. స్పందించిన కమిషనర్ మంగళవారం సాయంత్రం రత్నావళిని విధుల నుంచి రిలీవ్ చేశారు. తదుపరి పోస్టింగ్ కోసం డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూకు రిపోర్ట్ చేయాలని తన ఆదేశాల్లో సూచించారు. చీఫ్ మెడికల్ అధికారి బాధ్యతలను సహాయ వైద్య అధికారి కె.సురేష్‌బాబుకు అప్పగిస్తూ మంగళవారం కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. నూతన అధికారి విధుల్లో చేరే వరకు ఆయన ఇన్‌ఛార్జిగా కొనసాగుతారు.

జాతీయ రహదారి సుందరీకరణపై దృష్టి

రామవరప్పాడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు గన్నవరం విమానాశ్రయం నుంచి రామవరప్పాడు జాతీయ రహదారి మీదుగా రాజధాని అమరావతికి చేరుకుంటారని, ఈ మార్గాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సుందరీకరణ, పచ్చదనంపై దృష్టి పెట్టాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం పటమటలోని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, జాతీయ రహదారులు, పంచాయతీ అధికారులతో యార్లగడ్డ వెంకట్రావు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెటర్నరీ కళాశాల వద్ద చేయాల్సిన సుందరీకరణ పనులు, రామవరప్పాడు రింగ్ నుంచి విమానాశ్రయం వరకు చేయాల్సిన బ్యూటిఫికేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు ఇతర సమస్యలను గతంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. కేసరపల్లి నుంచి రామవరప్పాడు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు మరమ్మతులు చేయించాలని సూచించారు. తమకు శానిటరీ సిబ్బంది, పోలీస్ సహకారం కావాలని అధికారులు ఎమ్మెల్యేను కోరడంతో ఆయన వెంటనే ఎయిర్‌పోర్టు డైరెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజేంద్రరెడ్డి, జీఎం దయాకర్‌బాబు, ప్రిన్సిపల్ ల్యాండ్ స్కేప్ అర్కిటెక్ సత్యనారాయణ, డీడబ్ల్యూఎం కృష్ణ, ఏపీడీ నారాయణరావు, ఏపీవో లక్ష్మి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

నైపుణ్యాల మెరుగుకే పోటీల నిర్వహణ

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థ మహిళా కళాశాలలో 'అద్వితీయ 2024' పేరుతో ఇంటర్ కాలేజియేట్ అకడమిక్ పోటీలు ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో కార్యక్రమం గోడప్రతులను ప్రిన్సిపల్ ఎస్.కల్పన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగియున్న సృజన, నైపుణ్యాలు, పోటీతత్వం పెంపునకే పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పీపీటీ, పోస్టర్ ప్రదర్శన, షార్ట్ ఫిల్మ్‌మేకింగ్, కోల్లేజ్ మేకింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ స్టడీస్, వ్యాసరచన, వక్తృత్వం, చర్చ, రైటింగ్, మిస్టర్, మిస్ అద్వితీయ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కళాశాల ప్రత్యేకాధికారి ఆర్.మాధవి, ఏఓ ఎల్.కె.మోహన్‌రావు, సమన్వయకర్తలు కె.శైలజరాణి, ఎన్.సరిత తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ కల్పన తదితరులు

నవంబరు 6 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : పట్టభద్రులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా సెంట్రల్ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, వివిధ సంఘాల నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్క ఇంట్లోనూ పట్టభద్రులు ఉంటారని, వారి పేర్లను నమోదు చేయించాలని కోరారు. గతంలో నమోదు చేసుకున్న వారు కూడా తాజాగా నమోదు చేసుకోవాలనే విషయాన్ని తెలియజేయాలని సూచించారు. నవంబరు 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. తెదేపా అభ్యర్థికి ఓటువేసి కూటమి ప్రభుత్వానికి విజయం సాధించి పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా అలపాటి రాజాను అందరికీ పరిచయం చేశారు. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త బొలిశెట్టి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పటమట, న్యూస్‌టుడే: కూటమి నేతలు తమ ఎన్నికల ప్రణాళికలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటినా ఆ ఊసే ఎత్తడం లేదని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను అశోక్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ సీఐటీయూ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇసుక ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పి, రవాణా ఛార్జీల పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. చిన్న చిన్న నిర్మాణదారులు ఇసుక ఉచితంగా వస్తుందని పనులు చేపట్టారని, ధరలు అధికంగా ఉండటంతో అర్ధాంతరంగా నిలిపేశారని పేర్కొన్నారు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం జారీ చేసిన మెమో 1214 రద్దు చేయాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని గద్దె హామీనిచ్చారు. సీఐటీయూ నాయకులు వి.బి రాజు, టి.చంద్రశేఖర్, ఎస్.వెంకట గోపాలకృష్ణ, పి.కరీముల్లా, పి.కిరణ్‌కుమార్, ఓ.రాంబాబు, కోటి రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూసీడీ పీవో సరెండర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ సామాజికాభివృద్ధి సంస్థ (యూసీడీ) ప్రాజెక్టు అధికారి సీహెచ్.వెంకటేశ్వర్లును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) విభాగానికి సరెండర్ చేస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సంభవించిన వరదల సమయంలో యూసీడీ పీవోకు అప్పగించిన విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం, ఆయనకు అప్పగించిన విధులు చట్టపరంగా నిర్వహించడంలో విఫలం కావడంతో పాటు, అతి కీలకమైన సమయంలో ఆయన వైఖరి సక్రమంగా లేనట్టు గుర్తించారు. మరోవైపు ప్రకృతి విపత్తుల విధుల నిర్వహణలో ఆయన విఫలమైనట్లు, ఆయన ప్రవర్తన ఉన్నతాధికారులకు ఇబ్బంది కలిగినట్లు తేలింది. పొదుపు సంఘాల మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో పాటు, ఆయన తీరు శిక్షార్హంగా ఉన్నట్టు మెప్మా అధికారులు గుర్తించి కమిషనర్‌కు నివేదిక పంపారు. ఆయా కారణాలతో యూసీడీ పీవో విధుల నుంచి ఆయన్ని తప్పించి, ఎంఏయూడీకి సరెండర్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మరమ్మతులు, నిర్వహణ నేపథ్యంలో మొగల్రాజపురం సెక్షన్, 11 కేవీ జమ్మిచెట్టు ఫీడర్, మహాత్మాగాంధీ ఇండోర్ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, బృందావన్ విద్యుత్తు ఉప కేంద్రం, 11 కేవీ ఎలక్ట్రిసిటీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. వాటర్ ట్యాంక్ రోడ్డు, బాడవపేట, జక్రియ వీధి, జాన్ వీధి, కార్వే కార్యాలయం, యూనియన్ బ్యాంక్, బృందావన కాలనీ, ఫకీర్ గూడెం, జార్జిపేట, ప్రశాంత హాస్పటల్, డీ అడ్రస్ మాల్, బందరు రోడ్డు, సిద్ధార్థ మహిళా కళాశాల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని, ఆ ప్రాంత వినియోగదారులు సహకరించాలని కోరారు.

భవిత కేంద్రం ప్రారంభం



వాక్‌థాన్‌లో డీఈవో సుబ్బారావు తదితరులు

కరెన్సీనగర్, పటమట, న్యూస్‌టుడే: పిల్లలకు వచ్చే డిస్లెక్సియా వ్యాధి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు అన్నారు. నాలుగో డివిజన్ ఏపీఐఐసీ కాలనీ రేగుల అనూరాధ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 'భవిత సెంటర్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి 2 కి.మీ. వాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీసీ జి.మహేశ్వరరావు, సమన్వయకర్తలు వనజ, వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని సుజాత, ఉపాధ్యాయులు పి.కెజియ, వి.విశిత పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతోనే ప్రగతి

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నూతన ఆలోచనలు, ఆవిష్కరణలతోనే యువత ఉన్నత స్థానానికి వెళ్తారని ట్రేడ్ మార్క్ అటార్నీ ఎం.శ్రీధర్ అన్నారు. సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఐపీఆర్, ఐఐసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరణ దినోత్సవం కళాశాలలో నిర్వహించారు. నూతన ఆలోచనలకు పేటెంట్ తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆచంటి సునీత మాట్లాడుతూ.. పేటెంట్ తీసుకోవడం వల్ల వచ్చే హక్కులు, ట్రేడ్ మార్క్, కాపీరైట్ అంశాల గురించి వివరించారు. కార్యక్రమం నిర్వహణాధికారి డి.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్, వేదికపై సునీత, జ్యోతిర్మయి

టీడీఆర్ బాండ్లపై ఆంక్షలు ఎత్తివేయండి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా టీడీఆర్ బాండ్లపై ఉన్న ఆంక్షలు తొలగించి అర్హులైన వారందరికీ కేటాయించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు వినతి పత్రం అందించినట్లు కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు తెలిపారు. సీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేసినట్లు చెప్పారు. 'తూర్పు' పరిధిలోని హైటెన్షన్ రోడ్డు, ఇతర అంతర్గత రహదార్లలో టీడీఆర్ బాండ్ల జారీ జాప్యంతో విస్తరణ పనులు అటకెక్కిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

కామన్ ఇంట్రెస్టు సంఘాలకు రుణాలివ్వండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని స్వయం సహాయక సంఘాల తరహాలోనే కామన్ ఇంట్రెస్టు గ్రూపులకు రుణ సదుపాయం కలిగించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. యూసీడీ ఉద్యోగులు, పలు బ్యాంకు శాఖల ప్రతినిధులతో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ అర్బన్ లవ్లీహుడ్ మిషన్ 2.0 ద్వారా కామన్ ఇంట్రెస్టు గ్రూపులకు రుణ సాయం అందించేందుకు విశాఖపట్నంతో పాటు విజయవాడను పైలెట్ ప్రాజెక్టుగా కేంద్రం ఎంపిక చేసిందని వెల్లడించారు. వివిధ స్వయం సహాయక సంఘాల తరహాలోనే కామన్ ఇంట్రెస్టు గ్రూపులు తయారు చేసి, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చూడాలని అన్నారు. నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్, ప్రధానమంత్రి స్వానిధి పథకం కింద మంజూరైన నిధులు వెంటనే విడుదల చేయాలని, అర్హత కలిగిన వీధి విక్రయదార్లకు పెండింగ్‌లో ఉన్న రుణాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రియాంక, బ్యాంకు కో-ఆర్డినేటర్లు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఉత్సాహంగా 'గ్రాన్ కినోస్ 3.ం'

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోల కళాశాల విజువల్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో 'గ్రాన్ కినోస్ 3.0' పేరుతో పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్, విజువల్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి రాయప్ప, సాంస్కృతిక విభాగాధిపతి ఎల్.శుభ పోటీలు ప్రారంభించి మాట్లాడుతూ.. సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. నగరంలోని 8 కళాశాలల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. సోలో డాన్స్‌లో నాగ మహిత, వరుణ్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. బృంద నృత్య విభాగంలో శ్రావ్య, సౌమ్య ప్రథమ, మేధ, మెహక్ ద్వితీయ బహుమతి సాధించారు. టాలెంట్ షోలో ధరణి, లక్ష్మీశ్రావణి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. స్పాట్ ఫొటోగ్రఫీలో మొదటి బహుమతి సాయిరాం, రెండో బహుమతి ప్రణతి సాధించారు. పోటీలను అధ్యాపకులు ఎన్.శ్రీధర్, జి.కార్తీక్, పి.లలిత పర్యవేక్షించారు.



జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభిస్తున్న శుభ, రాయప్ప తదితరులు

మానవ సంబంధాలతో ఒత్తిడి దూరం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : యువత సమయ పాలన, స్వీయ గౌరవంతో పాటు మంచి మానవ సంబంధాలతో ఒత్తిడిని సులభంగా జయించవచ్చని ప్రముఖ మానసిక వైద్యుడు విశాల్ ఇండ్ల తెలిపారు. స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విద్యార్థి విభాగం, సీఐఐ విజయవాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడి - నిర్వహణ అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి వల్ల రోడ్డు ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని ఎలా అధిగమించాలో సూచనలిచ్చారు. సానుకూల దృక్పథంతో ఉంటే జీవితంలో విజయాలు సొంతమవుతాయని తెలిపారు. ఇమిస్ ఫార్మాస్యూటికల్ ఎండీ వి.నాగలక్ష్మి, సీఐఐ ప్రతినిధులు చందన్ పట్నాయక్, డి.వి.రవీంద్ర, డీన్ రాజేష్ సి.జంపాల తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాగలక్ష్మి, విశాల్, రవీంద్రనాథ్, రాజేష్ తదితరులు

స్ఫూర్తిప్రదాత.. అబ్దుల్ కలాం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశానికి ఖ్యాతి తీసుకురావడంతో పాటు, రాష్ట్రపతిగా ప్రజల మన్ననలు అందుకున్న అబ్దుల్ కలాంను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు అన్నారు. మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా విద్యార్థులకు అబ్దుల్ కలాం విజయాలు అనే అంశంపై పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు మంగళవారం బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుణదల(పటమట), న్యూస్‌టుడే: దేశం గర్వించదగ్గ వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాం అని, ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గుణదలలోని ఎన్టీఆర్ జిల్లా వైకాపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 100 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, కలాలు అందజేశారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు సత్యనారాయణ, రహేనా నాహిద్, వియ్యపు అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో సుబ్బారావు

అధికారుల సీనియారిటీ జాబితా సరి చేయాలి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రవాణా శాఖ జోన్-3లో ఎస్సీ, ఎస్టీ అడ్మినిస్ట్రేటివ్ సీనియారిటీ జాబితాను తక్షణమే సరిచేయాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న జారీ చేసిన ఉత్తర్వులను ఎస్సీ, ఎస్టీ అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. సీనియర్, సాధారణ అధికారుల సీనియారిటీని తిరిగి తెస్తున్నట్లు పేర్కొనడం చట్ట వ్యతిరేకమన్నారు. దశాబ్దాల పాటు పోరాటాలతో సాధించుకున్న రాజ్యాంగ సవరణలు (77, 85), కీలకమైన నాగరాజ్, జర్నైల్ తీర్పులు ఎస్సీ, ఎస్టీ అధికారుల సీనియారిటీకి హక్కులు కల్పించాయని గుర్తు చేశారు. ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపుతున్న రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్‌సింగ్, జేటీసీ రమ్యశ్రీలను వెంటనే విధుల నుంచి తప్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే పదోన్నతుల్లో క్యాచ్‌అప్ రూల్స్ అమలును నిలిపివేయాలని, రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రను ఆపివేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మధు, దాసరి చెన్నకేశవులు, ఆంధ్ర మాల్యాద్రి, శ్యామ్‌కుమార్, ఎన్.మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు



ఐక్యత చాటుతున్న సుదర్శనం, మధు, చెన్నకేశవులు, మాల్యాద్రి తదితరులు

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), డి.శ్రీనివాసరావు (కృష్ణా) తెలిపారు. ఈ నెల 16న పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్‌లో అండర్-17 బాలబాలికల వాలీబాల్, 17న అండర్-14 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 18న నున్నలోని జడ్పీహెచ్ స్కూల్‌లో అండర్-14, 17 బాలబాలికల చెస్ జట్ల ఎంపికలు, 20న అండర్-14, 17 బాలబాలికల సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు తగు ధ్రువ పత్రాలతో సంబంధిత ప్రాంతాల్లో హాజరవ్వాలని సూచించారు.

దేశాభివృద్ధిలో రతన్‌టాటా పాత్ర కీలకం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన రతన్‌టాటా మరణం తీరని లోటని బీబీఏ కార్యవర్గం తీర్మానించింది. దేశం ఒక గొప్ప వ్యాపారవేత్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం బీబీఏ హాల్లో రతన్‌టాటాకు ఘనంగా నివాళులర్పించింది. అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామ్‌ప్రసాద్, సంపర శ్రీనివాసరావు, చంద్రశేఖర్, గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'కులాల ప్రాతిపదికన క్రీడా కోటా ఇవ్వడం సరికాదు'

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే క్రీడా కోటా కులాల ప్రాతిపదికన నిర్ణయించడం సమంజసం కాదని కబడ్డీ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి కేపీ రావు పేర్కొన్నారు. ఒక్క క్రీడా కోటా ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే కులాల రోస్టర్ ప్రాతిపదికన కేటాయించడం సరికాదని మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. మాజీ సైనికోద్యోగులు, ఎన్‌సీసీ, విభిన్న ప్రతిభావంతుల కేటగిరీల్లో ఏ విధంగా ప్రవేశాలు కల్పిస్తున్నారో.. అదే రీతిలో క్రీడా కోటాలో కూడా ప్రవేశాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్తింపుగల క్రీడాకారులకు ఆర్టీసీ బస్సు ఛార్జీలో ఇచ్చే రాయితీ పునరుద్ధరించాలని కోరారు.

లోన్ యాప్ పేరుతో మోసం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఫ్యాన్సీ దుకాణం మీద రుణం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన ఘటనపై వన్‌టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జునపేటకు చెందిన లక్ష్మికి ఫ్యాన్సీ దుకాణం ఉంది. తెలంగాణకు చెందిన పవన్ అనే వ్యక్తి సెప్టెంబరు 6న షాపు వద్దకు వచ్చి రూ.2 లక్షలు లోను వస్తుందని చెప్పి యాప్‌లో దరఖాస్తు చేశారు. వెంటనే రూ.1,90,000 బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. మీ బ్యాంకు లావాదేవీలు బాగా ఉన్నాయి. మీకు రూ.5 లక్షల వరకు రుణం వస్తోందని చెప్పగా ఆమె నమ్మారు. ఈ నేపథ్యంలో పవన్ పలు దఫాలుగా రూ.90 వేలు, 11న రెండు సార్లుగా రూ.90 వేలు నగదును తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. తర్వాత మీకు రూ.5 లక్షలు లోను వస్తుందని చెప్పి మభ్యపెట్టాడు. లోను రాకపోవడంతో సదరు ఫోన్ యాప్ నిర్వాహకులను సంప్రదించగా పవన్ అనే వ్యక్తి గతంలో తమ సంస్థకు ఎగ్జిక్యూటివ్‌గా పని చేశాడని అతడు ఖాతాదారుల మోసం చేస్తున్నాడని ఆరోపణలు రావడంతో ఉద్యోగం నుంచి తొలగించామని సమాధానం చెప్పారు. దీంతో మోసపోయినట్లు గ్రహించి బాధితురాలు తమకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై రమ్యశ్రీ సత్య ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

సీఎం సహాయనిధికి విరాళం



వరద బాధితుల సాయం కోసం అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్(టీఎన్‌టీయూసీ) తరఫున రూ.లక్ష సేకరించారు. తెలుగునాడు అంగన్‌వాడీ ద్వారా సాధికార సంస్థ ఛైర్మన్ ఆచంట సునీత ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం సీఎం చంద్రబాబుని కలిసి ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. -న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

నిర్మాణ పనులకు శంకుస్థాపన



భూమిపూజలో ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కే.అగ్రహారం, చిల్లకల్లు, తిరుమలగిరి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పల్లె పండగ' కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొన్నారు. వివిధ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుందని చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, ఆయా గ్రామాల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✦ పెనుగంచిప్రోలు తూర్పు బజారులో డ్రెయిన్లలో పూడిక తీయాలని స్థానికులు పంచాయతీ కార్యదర్శి శ్యాంకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన శుభ్రం చేయించారు.

✦ స్థానిక తుపాన్ కాలనీలో డ్రెయిన్ల సమస్యను స్థానికులు సర్పంచి పద్మకుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి సిబ్బందిని పంపించి డ్రెయిన్లు శుభ్రం చేయించారు.

✦ పెనుగంచిప్రోలులో తాగునీటి సరఫరా నిలిచి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు సర్పంచి పద్మకుమారికి ఫిర్యాదు చేశారు. ఆమె మరమ్మతులు చేయించి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. –న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

✦ మాగల్లు విలేజ్ క్లినిక్ వద్ద డ్రెయిన్లో మంగళవారం పూడిక తీయించారు. ఈనెల 9న 'ఈనాడు'లో 'మురుగు నీటిలో విలేజ్ క్లినిక్ భవనం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన కార్యదర్శి రవి స్పందించి చర్యలు తీసుకున్నారు.

✦ మాగల్లు బొడ్రాయి వీధిలోని డ్రెయిన్లో పూడిక కుప్పలు తొలగించాలని స్థానికులు పంచాయతీ కార్యదర్శి రవి దృష్టికి తీసుకువెళ్లగా వాటిని తీయించారు.

✦ లింగాలపాడు శివారు లచ్చపాలెం ఆంజనేయస్వామి దేవాలయంవద్ద బోరు పని చేయడం లేదని ఆ ప్రాంతవాసులు పంచాయతీ కార్యదర్శి సీతారామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన మెకానిక్‌ని పంపి మరమ్మతులు చేయించారు.

✦ కమ్మువారిపాలెం ప్రధాన రోడ్డులో ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదని స్థానికులు కార్యదర్శి ఆకుల హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

\- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

విధుల్లోకి తీసుకోవాలని వినతి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : స్థానిక తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం కేశఖండనశాలలో నాయీ బ్రాహ్మణులుగా పని చేసేందుకు ఐదుగురిని విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆలయ కల్యాణకట్ట సంఘం అధ్యక్షుడు కొలిపాక బ్రహ్మం తెలిపారు. కరోనా సమయంలో కేశఖండనశాలలో నాయీ బ్రాహ్మణులుగా పని చేస్తున్న ఐదుగురిని 60 ఏళ్లు దాటాయని తొలగించారు. వారి స్థానంలో వారి కుటుంబాలకు చెందిన వారిని నియమించాలి. కానీ ఇప్పటి వరకు నియామకం చేయక పోవడంతో వారంతా ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నట్లు తెలిపారు. పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పినట్లు ఆయన వివరించారు. సంఘ నాయకులు ఏలూరి శ్రీను, కృష్ణ, వెంకట్రావ్, నరసింహారావు, వీరాస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిమాణంలో ఉండవు.. ప్రమాణాలకు నిలవవు..

న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

తరతరాల విశ్వాసంతో వచ్చి కొండెక్కిన భక్తులకు స్వామిదర్శనం తర్వాత లభించే ప్రసాదం ఒక్కసారిగా క్షేత్రంపై ఉన్న గౌరవాన్ని తగ్గించేలా చేస్తుంది. రుచి లేకపోవడంతో పాటు పరిమాణానికీ, ప్రమాణాలకు నిలవని ప్రసాదాలతో తిరుమలగిరి భక్తులు నానా అగచాట్లు పడుతున్నారు. ఎప్పుడో తెప్పించిన ముక్కిపోయి వాసన వస్తున్న చింతపండుతో చేసిన ప్రసాదాన్నే సాక్షాత్తు తిరుమలగిరి తిరుమలేశుని భక్తులకు దేవస్థానం వారు విక్రయిస్తున్నారు. రేటు తక్కువగా వస్తుందని కొనుగోలు చేసిన నాణ్యత లేని నెయ్యితో చేసిన లడ్డూలనే భక్తులకు అమ్ముతున్నారు.



నాణ్యత లోపించిన తిరుమలగిరి ప్రసాదం

పదికిపైగా జిల్లాల నుంచి...

రాష్ట్ర సరిహద్దుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 10కి పైగా జిల్లాల వారికి కొంగుబంగారమై నిలిచే తిరుమలగిరి క్షేత్రంలో గత ప్రభుత్వంలో వచ్చిన ఈ మార్పు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఏటా రూ.72 లక్షల వరకూ ప్రసాద విక్రయాల మీద ఆదాయాన్ని దేవస్థానం పొందుతోంది. సిబ్బందే స్వయంగా ప్రసాదాలను తయారు చేయిస్తారు. గతంలో శనగపప్పు కొని దాన్ని పిండిగా మార్చే యంత్రం ద్వారా నాణ్యమైన పిండిని తయారు చేసి వాడేవారు. ఇప్పుడు అది కాస్తా మూలపెట్టి నాణ్యత లేని పిండిని కొనుగోలు చేస్తున్నారు. ప్రసాదాలను తామే తయారు చేసినా తయారీకి అవసరమైన ముడి సరకులు మాత్రం టెండర్ల ద్వారా తీసుకుంటారు. రివర్స్ టెండర్ల పుణ్యమా అని తక్కువ ధరకు కోట్ చేసిన వారు నెయ్యి, శనగపిండి, చింతపండు, జీడిపప్పు వంటి వాటిని నాణ్యత లేకుండానే సరఫరా చేస్తున్నారు. వాటిని యథాతథంగా వినియోగించడంతో ప్రసాదాలు రుచి లేకపోవడమే కాక ముక్కవాసన వస్తున్నాయని, మధ్యలో ఇసుక కూడా తగులుతోందని భక్తులు వాపోతున్నారు.

నాణ్యత లేదని ఫిర్యాదులు..

తమ కర్మాగారంలోని కార్మికులందరి కోసం గతంలో ప్రతి శనివారం ప్రసాదాలు తెచ్చి పంచే వారమని, నాలుగైదు నెలలుగా ప్రసాదాల నాణ్యతలో, రుచిలో గణనీయమైన తేడా కనిపించడంతో తెప్పించడం మానేశామని పారిశ్రామికవేత్త ముల్లంగి నర్సిరెడ్డి 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు.

★ **ఈ విషయమై ఈవో ఎంకేటీఎన్ ప్రసాద్‌ని వివరణ కోరగా** గతంలో తెప్పించిన సరకుల్లో నాణ్యతా లోపాలను గుర్తించామని, కొన్నింటిని వెనక్కి పంపామని తెలిపారు. మూలపడ్డ పిండి యంత్రాన్ని కూడా ఉపయోగంలోకి తీసుకొస్తామని, నెయ్యి, చింతపండు, శనగపిండి, జీడిపప్పు వంటి వాటిని నాణ్యతగా ఉండేలా చూస్తామన్నారు. తమకు కూడా భక్తుల నుంచి ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. లోపాలను అధిగమించి భక్తుల మనోభావాలను, విశ్వాసాన్ని కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రం ప్రారంభం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం రాత్రి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బొద్దుకోలు రమణయ్య మాట్లాడుతూ.. నవంబరు ఆరో తేదీ వరకు ఓటు నమోదుకు గడువు ఉందని చెప్పారు. పట్టభద్రులందరూ ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు జె.గంగరాజు, బెనర్జీ, నరసింహారావు, గోవిందు, సత్యనారాయణ, రామారావు, నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

నందిగామ, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. నందిగామలో విద్యుత్తు శాఖ ఈఈ మల్లెల వసంతరావు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విజయవాడ రూరల్ డివిజన్ ఈఈగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. సౌమ్య మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం స్థానిక సబ్‌స్టేషన్, ఏడీఈ, ఈఆర్వో కార్యాలయాలను ఈఈ సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఐతవరంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌ను కలిశారు. జగ్గయ్యపేట ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈలు దిబ్బయ్య, పూర్ణచంద్రరావు, తారాచంద్ పాల్గొన్నారు.

కూటమి పాలనతో గ్రామాల్లో పండగ



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన ఇన్‌ఛార్జి రమాదేవి తదితరులు

వీరులపాడు, న్యూస్‌టుడే : రాక్షస పాలన అంతమై, ఎన్డీయే పాలనలో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పల్లె పండగ'లో భాగంగా జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి మంగళవారం నిర్వహించిన శంకుస్థాపనలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తంబళ్లపల్లి రమాదేవితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైకాపా అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని అన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రహదారులు మినహా వైకాపా పాలనలో ఒక్క రహదారి కూడా నిర్మించలేకపోయిందని అన్నారు. వైకాపా విధ్వంస పాలనతో అష్టకష్టాలు అనుభవించిన ప్రజలు, కూటమి పాలనతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని చెబుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. అనంతరం అల్లూరులో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలతో సతమతం

నందిగామ, న్యూస్‌టుడే: మండలంలోని తొర్రగుడిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా సక్రమంగా లేక అవస్థలు పడుతున్నామని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇన్‌ఛార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొణతమాత్మకూరు సర్పంచి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. తరచూ విద్యుత్తు ఆగిపోవడంతో తాగునీరు, ఎత్తిపోతల పథకాల మోటార్లు పని చేయక తాగు, సాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. దీనిపై ఏఈ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. తాను ఇటీవలే విధుల్లో చేరానని, సమస్య పరిష్కరిస్తానని తెలిపారు.

★ ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల పంటలు దెబ్బతిన్న 22 మంది మాగల్లు రైతులకు నష్టపరిహారం మంజూరు కాలేదని ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మినేని శోభారాణి తెలిపారు. శనగపాడు, అనాసాగరం వైపు వెళ్లే డొంకరోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, పక్కన తహసీల్దారు సురేష్

★ పల్లె పండగ కింద గ్రామాల్లో మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణానికి స్థానిక రీచ్‌ల ఇసుక తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ బుధవారం నుంచి కంచల రీచ్‌లో తవ్వకాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

★ వైరా ఏరుకు వచ్చిన వరద ఉద్ధృతికి కూడలి దాములూరు వద్ద రోడ్డుకు గండ్లు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని సర్పంచి కోటేశ్వరరావు తెలిపారు. వెంటనే మరమ్మతులు చేయాలన్నారు.

★ పంచాయతీల్లో నిధులు లేక బోర్లకు మరమ్మతులు చేయించలేకపోతున్నట్లు పల్లగిరి సర్పంచి, కంచల ఎంపీటీసీ సభ్యుడు సీతయ్య తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. పంచాయతీ సాధారణ నిధులతో బోర్ల మరమ్మతులు చేయిస్తామన్నారు. కంచల నుంచి పొలాలకు వెళ్లే డొంక రోడ్డు, విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయాలని, మరమ్మతులు చేయించాలని సీతయ్య కోరారు.

★ మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు ఉన్నారని, ప్రజలకు అందుబాటులో ఉండని కార్యదర్శులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు. తహసీల్దారు నూతక్కి సురేష్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఫిర్యాదిదారే.. నిందితుడు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : మండలంలోని చిల్లకల్లు సమీపంలో అపహరణకు గురైన లారీ విషయంలో విచారణ నిర్వహించిన జగ్గయ్యపేట సీఐ జానకిరామ్ ఫిర్యాదినే నిందితుడిగా నిర్ధారించారు. సీఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 12న చిల్లకల్లు శివార్లలోని కింగ్ దాబా వద్ద నిలిపిన లారీ ఉదయం చూస్తే కనిపించలేదని డ్రైవర్ ఆయూబ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పరిశోధన చేసిన సీఐ ఫిర్యాదిదారే లారీలపై ఉన్న ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక లారీ దాచారని, అందులో ఉన్న పంచదార లోడ్ కూడా అమ్ముకునేందుకు సిద్ధపడ్డారని తేల్చారు. లారీతో పాటు 630 బస్తాల పంచదారను కూడా పట్టుకున్న పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అభ్యాసన వైకల్యంపై అవగాహన

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు, న్యూస్‌టుడే: నందిగామలో మంగళవారం డిస్లెక్సియా మాసం సందర్భంగా అభ్యాసన వైకల్యంపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక నెహ్రూనగర్ భవిత డే కేర్ సెంటర్‌లోని అభ్యాస వైకల్య విద్యార్థులు, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గాంధీ సెంటర్ వరకు ప్రదర్శన చేశారు. ఎంఈవో-2 ఎం.పద్మ, ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, రాజేశ్వరి, ప్రత్యేక శిక్షకురాలు మేరీగ్రేస్, రిసోర్సుపర్సన్లు కేవీ నాగమల్లేశ్వరరావు, ఎ.శారద పాల్గొన్నారు. కంచికచర్ల ఎంపీపీ(మెయిన్) పాఠశాల, జుజ్జూరు ఎంపీపీ (మెయిన్) పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. జుజ్జూరులో నిర్వహించిన ప్రదర్శనలో వీరులపాడు మండల విద్యాశాఖాధికారి పాల్ కెనడీ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. చందర్లపాడులో కూడా ప్రదర్శన నిర్వహించారు. ఎంఈవో శ్యాంబాబు, ప్రధానోపాధ్యాయులు రోహిణి, వై.అనుపమ, కుమారి, స్వరూపరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నందిగామ: విద్యార్థులు, ఎంఈవో-2 పద్మ ప్రదర్శన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : పెనుగంచిప్రోలు కేవీఆర్ జడ్పీ పాఠశాలలో డిస్లెక్సియా గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో తరచుగా వినిపించే నరాల బలహీనత వల్ల చదవకపోవడం, మాట్లాడలేకపోవడం, చురుకుదనం తగ్గడం వంటి లక్షణాలతో డిస్లెక్సియా వస్తుందని హెచ్ఎం జలజ తెలిపారు. ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, సునీల్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట మండల భవిత కేంద్రంలో మంగళవారం నిర్దిష్ట అభ్యాసన వైకల్యాలపై అవగాహన మాసం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వైకల్యాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి జీవన శైలిలో పురోభివృద్ధిని పెంచడంపై నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.శివరాం నాయక్, భవిత కేంద్రం సహిత విద్యా ఉపాధ్యాయులు డి.జానకి తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో...

చేతులు మారుతున్న మద్యం దుకాణాలు!

నందిగామ, న్యూస్‌టుడే

లాటరీలో మద్యం దుకాణాలు వచ్చిన వారికి కాసుల వర్షం కురిసేలా పరిస్థితి కనిపిస్తోంది. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో రూ.కోటికి పైనే దుకాణం పలుకుతోంది. ప్రస్తుతం దుకాణాల కోసం జోరుగా బేరసారాలు సాగుతున్నాయి. పోటీ అధికంగా ఉండటంతో ఇంకా ఎక్కువ సొమ్ము వస్తుందని దుకాణాలు వచ్చిన వారు ఆచీతూచి వ్యవహరిస్తున్నారు.

★ నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మద్యం వ్యాపారం జోరుగా సాగుతుంది. తెలంగాణ రాష్ట్రం సరిహద్దుగా ఉన్నందున అమ్మకాలు బాగా జరుగుతాయని వ్యాపారుల అంచనా. పైగా నాణ్యమైన సరకు, అన్ని బ్రాండ్లు విక్రయిస్తామని, రూ.99కే క్వార్టర్ నాణ్యమైన మద్యం లభిస్తుందని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఫలితంగా రెండు నియోజకవర్గాల్లో మద్యం దుకాణాల కోసం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వారు దరఖాస్తు చేశారు. కొందరు సిండికేటై దరఖాస్తు చేసినా దుకాణాలు దక్కలేదు. స్థానికులకు కొన్ని వచ్చాయి. మిగిలినవి తెలంగాణ వారికి దక్కాయి. పెనుగంచిప్రోలులోని ఐదు దుకాణాలకుగాను రెండు స్థానికులకు వచ్చాయి. మిగిలిన మూడు తెలంగాణ వారికి వెళ్లాయి. వత్సవాయి మండలంలోని రెండు దుకాణాల్లో ఒకటి స్థానికులకు, రెండోది తెలంగాణ వ్యక్తికి వచ్చింది. వారిలో కొందరు వివిధ కారణాల వల్ల దుకాణాలు విక్రయించేందుకు సిద్ధమయ్యారు.

వ్యాపారంపై మక్కువతో..

గతం నుంచి మద్యం వ్యాపారంలో ఉన్న వారికి ఈ సారి లాటరీలో దుకాణాలు దక్కలేదు. వారు సిండికేట్‌గా ఏర్పడి ఎక్కువ దరఖాస్తులు వేసినా ఫలితం లేకపోయింది. ఎలాగైనా దుకాణం మన చేతుల్లో ఉండాలని కొందరు... ఇతరుల దుకాణాల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు. దుకాణం ఉంటే సిండికేటై వ్యాపారం చేసి లాభాలు గడించవచ్చునని భావిస్తున్నారు. పెనుగంచిప్రోలు పరిధిలో ఒక దుకాణం రూ.కోటికి విక్రయించినట్లు సమాచారం. మిగిలిన వాటికి అదే స్థాయిలో బేరం సాగుతోంది. వత్సవాయి మండలంలోని దుకాణాలకు కూడా బేరాలు జరుగుతున్నాయి. నందిగామ, చందర్లపాడు మండలాల్లో తెలంగాణ వారికి వచ్చిన దుకాణాలు ఒక్కొక్కటి రూ.కోటి చెబుతున్నారు. రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఇస్తామని కొనుగోలుదారులు బేరాలు పెడుతున్నారు. రెండు రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

కలాం జీవితం యువతకు ఆదర్శం

న్యూస్‌టుడే బృందం: క్షిపణి పరీక్షలతో భారత కీర్తి పతాకను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని వక్తలు పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



కంచికచర్లలో మాజీ రాష్ట్రపతి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జనసేన నాయకురాలు రమాదేవి తదితరులు



జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తెదేపా నాయకుల నివాళి



పెనుగంచిప్రోలులో...

జనసేనలో చేరిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన పలువురు వైకాపా నాయకులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. నాయకులు గాదెల రామారావు, కోమటి వెంకటేశ్వరరావు, గింజుపల్లి అచ్చయ్య, పొనకల గోపి, మీసాలరాజు, రామిశెట్టి రామారావు, సుదర్శన్ తదితరులకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మహిళపై దాడి: నలుగురిపై కేసు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : మండలంలోని నవాబుపేటలో ఎరగొర్ల వెంకట్రావమ్మ అనే మహిళపై దాడికి పాల్పడిన నలుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అర్జున్ తెలిపారు. ఈ విషయమై బాధితురాలి భర్త ఎరగొర్ల శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావుకు స్వయానా సోదరులైన గురవయ్య, ముత్తయ్య, వారి కుమారులు కలిసి స్థల వివాదంపై గొడవ పడి శ్రీనివాసరావు భార్య వెంకట్రావమ్మపై దాడికి పాల్పడ్డారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం: ముక్త్యాలలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ భవానీ పత్తి పంటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల 16 నాటికి పంట నమోదులో అభ్యంతరాలు ఉంటే తెలపాలని రైతులను కోరారు. ఏవో వి.వరలక్ష్మి పాల్గొన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే : మోగులూరు, మున్నలూరు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పత్తిని పరిశీలించి అధిక దిగుబడి సాధించేందుకు సూచనలు చేశారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకురాలు మోనీషా, ఏవో విజయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనం



పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని మంగళవారం వైభవంగా ఊరేగింపు చేసి స్థానిక మునేరులో నిమజ్జనం చేశారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

నిర్వహణ లేక... పూడిక తీయక

ఏనుగు గడ్డ వాగు ప్రవాహ ప్రాంతం అధ్వానం

కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని వినతి

కంచికచర్ల, న్యూస్‌టుడే

వైకాపా ఐదేళ్ల నిర్లక్ష్య పాలన వాగుల పరీవాహక ప్రాంతాల రైతులకు శాపంగా మారింది. సంక్షేమం పేరుతో పాలనను పూర్తిగా అటకెక్కించిన గత పాలకులు అన్నదాతలకు కష్టాలు మిగిల్చారు. అన్ని రంగాలను విస్మరించినట్లే వాగుల ప్రవాహ ప్రాంతాలను పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు కూడా నిర్వహించకపోవడంతో అవి చిట్టడవులను తలపిస్తున్నాయి. నిండా కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ప్రవాహానికి అవి అడ్డంకిగా మారి వరదకు కారణమయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలోని ఏనుగు గడ్డ వాగే అందుకు ఉదాహరణగా చెబుతున్నారు. తెలంగాణ ప్రాంతంలో ప్రారంభమయ్యే ఏనుగు గడ్డ వాగు వీరులపాడు మండలం గూడెం మాధవరం వద్ద ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి పెద్దాపురం, అల్లూరు, చెన్నారావుపాలెం, నరసింహారావుపాలెం మీదుగా కంచికచర్ల మండలం గొట్టుముక్కల, పరిటాల గ్రామాల మీదుగా వెళ్లి పరిటాల చెరువులో కలుస్తుంది.



వీరులపాడు మండలం పెద్దాపురం వద్ద కంప చెట్లతో ఇలా..



గొట్టుముక్కల వద్ద కోతకు గురైన దారి

సుమారు 20 కి.మీ. మేర..

రెండు మండలాల పరిధిలో సుమారు 20 కి.మీ. ప్రవహించే ఏనుగు గడ్డ వాగుకు గతంలో ఇంతకన్నా భారీ వర్షాలు కురిసిన సందర్భంలోనూ ఇంతలా పొంగలేదని రైతులు చెబుతున్నారు. వాగు ప్రవాహానికి అడ్డంగా కంప చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడం, ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో వరద ముందుకు వెళ్లక పలు చోట్ల రహదారులు కోతకు గురి కావడంతో పాటు వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. గత నెలలో సంభవించిన విపత్తు కారణంగా రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. కోతకు గురైన దారులకు ఆయా గ్రామాల నాయకులు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. మరికొన్ని చోట్ల ఇప్పటికీ గండ్లు అలానే ఉన్నాయి. రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా ఏనుగు గడ్డ వాగు ప్రవాహ ప్రాంతంలో పెరిగిన పిచ్చి మొక్కలు, పూడిక తొలగించాలని, పూడిక మట్టితో గండ్లు పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

ఇరవై ఏళ్ల యజ్ఞం..ఇంటింటికీ భోజనం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: శ్రీగురుధామ్‌కి అనుసంధానంగా మొదలైన అన్న మహాయజ్ఞాన్ని సద్గురు సేవా సమితి ప్రతినిధులు ఇరవై ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. 20 మంది అన్నార్తులకు ఆకలితీర్చడంతో మొదలైన కార్యక్రమం నేడు 200 మందికి ఇంటింటికి వెళ్లి అందిస్తున్నారు. పట్టణంలోని శివానంద హోటల్ నిర్వాహకులు గూడురు నాగభూషణం, కుమారుడు త్రినాథ్ తమ మిత్రబృందంతో కలిసి కొనసాగిస్తున్న ఈ కార్యక్రమానికి పలువురు దాతలు సహకారం అందిస్తున్నారు. స్థానికంగా ఒక నివాసంలో ప్రతి రోజూ వంట చేసి అన్నం, కూర, చారు, మజ్జిగలతో కూడిన పొట్లాలను సిద్ధం చేస్తారు. పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన అనాథ వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి వీటిని అందిస్తారు. ఇరవై ఏళ్లవీరి స్ఫూర్తి అనేక ప్రాంతాలు, సంస్థలు, కుటుంబాలకు విస్తరించింది. కరోనా సమయంలోనూ ఆగకుండా సాగిన వీరి అన్నదాన కార్యక్రమంలో భాగంగా అవసరాన్ని బట్టి వృద్ధులకు దుప్పట్లు, చెప్పులు, గొడుగులు, మందులు కూడా అందజేస్తారు.



స్థానికులకు ఆహారం అందిస్తున్న సేవా సమితి ప్రతినిధి

దుప్పట్ల పంపిణీ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని జయంతిపురం, రావిరాల గ్రామాల్లో రాంకో సిమెంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాంకో సిమెంట్ అధ్యక్షుడు ఆశిష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జయంతిపురం రాంకో ఆడిటోరియంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన వారికి మందులు పంపిణీ చేశామని చెప్పారు.

? భవానీపురం లలితానగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగు ముందుకు కదలక దోమల బెడద ఎక్కువగా ఉంది. కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ తెరిచి ఉన్నాయి. దీంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం లేక పోలేదు. **-పిడుకొండలు, భవానీపురం**

✔ సమస్యను సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కారం చేలా చర్యలు చేపడతాం. **-ప్రసాద్, ఈఈ, నగరపాలక సంస్థ**

? భవానీపురం చర్చి సెంటర్ వద్ద వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసు సిబ్బంది అక్కడ ఉండటం లేదు. **-శ్రీరాం, విద్యాధరపురం**

✔ సిబ్బందిని నియమించేలా చర్యలు చేపడతాం.

-సురేష్, సీఐ, ట్రాఫిక్ విభాగం -న్యూస్‌టుడే, భవానీపురం

భవిత కేంద్రం ప్రారంభం

కరెన్సీనగర్: పిల్లలకు వచ్చే డిస్లెక్సియా వ్యాధి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు అన్నారు. ఆయనతో డివిజన్ ఏపీఎస్పీ కాలనీ రేగుల అనూరాధ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 'భవిత సెంటర్‌'ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి 2 కి.మీ. వాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీసీ జి.మహేశ్వరరావు, సమన్వయకర్తలు వనజ, వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని సుజాత, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పి.కెజియ, విశిత పాల్గొన్నారు.

విజయవాడ పశ్చిమ

వారధిపై నిలిచిన వాహనాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: గుంటూరు వైపు నుంచి విజయవాడ వైపునకు వచ్చే కనకదుర్గమ్మ వారధిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు నరకాన్ని చూశారు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో వారధిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మరమ్మతులకు లోనై నిలిచిపోయింది. బస్సును అక్కడ నుంచి తొలగించకపోవడంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రెండు గంటల సమయం పట్టింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గోడు ఆలకించండి.. వరద సాయం అందించండి

46వ డివిజన్ బాధితుల గగ్గోలు



వరదలో మునిగిన ద్విచక్ర వాహనాలు (పాత చిత్రం)

చిట్టినగర్, న్యూస్‌టుడే

బుడమేరు వరద ముంపుతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు చివరి వ్యక్తి వరకు సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో మాత్రం పరిహారం అందలేదని పలువురు బాధితులు ఇప్పటికీ గగ్గోలు పెడుతున్నారు. వీధి మొత్తం ముంపునకు గురైతే దిగువ భాగంలో ఉన్న కొందరికి మాత్రమే ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చాయని, మరి కొందరికి రాలేదని వాపోయారు. మొదటి, రెండో అంతస్తుల్లో నివాసితులకు రూపాయి కూడా పడలేదని వాహనాలు దెబ్బ తిన్నాయని, పనులకు వెళ్లక ఇబ్బంది పడ్డామన్నారు. మాకు తీవ్రమైన అన్యాయం జరిగిందంటూ బాధితులు 'న్యూస్‌టుడే'తో తమ ఆవేదనను ఇలా వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకులో రూపాయి పడలేదు



మేము 46వ డివిజన్‌లో ఉంటున్నాం. మా వీధిలో వరద నీరు నాలుగు అడుగులకు పైగా వచ్చింది. వాహనాలన్నీ మునిగిపోయాయి. పది రోజుల పాటు పునరావాసం వెళ్లాల్సిన పరిస్థితి. ఇంత వరకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రూపాయి కూడా రాలేదు. అదేమంటే మొదటి అంతస్తు వారికి రాదని వాలంటీర్లు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు పై అంతస్తులో ఉన్నవారికి రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో అందరికీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయి. మాకు తగు న్యాయం చేయాలి. **-ప్రవల్లిక**

అన్యాయం జరిగింది



వరదలో మా వాహనం పూర్తిగా మునిగి ఎందుకు పనికి రాకుండా పోయింది. ఇంతవరకు బ్యాంకులో నగదు పడలేదు. మా వీధిలో కింది పోర్షన్‌లో ఉన్న వారికి కూడా ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదు. భాగ్యలక్ష్మి అనే ఆమెకు జాబితాలో పేరు ఉన్నప్పటికీ డబ్బులు పడ లేదు. మా వీధిలో చాలా మందికి అన్యాయం జరిగింది. సెప్టెంబరు 28న కలెక్టరును కలిసి అర్జీలు పెట్టుకున్నాం. పరిశీలించి తగు న్యాయం చేస్తామని చెప్పారు. ఇంతవరకు ఏమీ చేయలేదు. **-పద్మావతి, గృహిణి**

కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాం



వరద ముంపులో మా రెండు వాహనాలు పాడయ్యాయి. మొదటి అంతస్తులో ఉన్న వారికి రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. బ్యాంకులో ఇంతవరకు డబ్బులు పడలేదు. సచివాలయం చుట్టూ తిరిగినా ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదు. వరద సమయంలో నష్టం రాసుకోవడానికి వచ్చిన వారు సరిగా పట్టించుకోలేదు. ఈ విషయమై కలెక్టర్‌కి అర్జీ పెట్టుకున్నాం విచారించి న్యాయం చేస్తామని చెప్పారు. 20 రోజులు గడిచింది. వీఆర్వో వస్తారని చెప్పారు. మమ్మల్ని పలకరించిన వారే లేరు. **-రాజకుమారి, గృహిణి**

తూతూమంత్రంగా మాట్లాడి వెళ్లారు



మేము ఉండే 46వ డివిజన్‌లో వరద ముంచెత్తి అక్కడ నుంచి 47 డివిజన్‌లో అన్ని ప్రాంతాలు మునిగితే మాకు నష్టపరిహారం ఇవ్వకుండా పైభాగంలో ఉన్న వారికి ఇచ్చి మాకు అన్యాయం చేశారు. అదేమని అడిగితే వాలంటీర్లు మాకు తెలియదని, ఇంకా వీఆర్వో అయితే సమాధానమే చెప్పకుండా వెళ్లిపోయారు. కలెక్టరును కలిస్తే అధికారులను పంపుతామని చెప్పారు. పండగ రోజుల్లో వీఆర్వో వచ్చి తూతూమంత్రంగా ఒక్కరి ఇద్దరితో మాట్లాడి వెళ్లిపోయారు. మాకు ఇంతవరకు న్యాయం జరగలేదు. **-ఝాన్సీ రాణి**

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

భవానీపురం, న్యూస్‌టుడే: సామాన్య కుటుంబంలో జన్మించి దేశంలో ఉన్నత స్థానానికి చేరిన గొప్ప వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి కలాం జయంతిని విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి కలాం చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. అణు పరీక్షల ద్వారా దేశ బలాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు. నిరాడంబర జీవితాన్ని గడిపిన ఆయన దేశ ప్రజలకు ఆదర్శనీయులని కొనియాడారు. ఉన్నత స్థానాలకు చేరినా సాధారణ పౌరుడిగానే భావించే వారన్నారు. అనంతరం పోర్ట్స్ ఫౌండేషన్ అధినేత శివశ్రీ గౌడ్ మెడల్ భాజపా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు షేక్.బాజీ, సయ్యద్‌బాషా, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్

చిట్టినగర్: భారత దేశానికి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం ఎనలేని సేవలు అందించారని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 56వ డివిజన్ నైజాంగేటు అంబేడ్కర్ విగ్రహం వద్ద వైకాపా మైనార్టీ నాయకుడు బాజీ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు శిరంశెట్టి పూర్ణచంద్రరావు, రెహ్మతున్నీసా, ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిట్టినగర్ : అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద మాజీ మంత్రి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

సీఎంవోహెచ్ రత్నావళి డిప్యూటేషన్ ఉపసంహరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో చీఫ్ మెడికల్ ఆరోగ్య అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి. రత్నావళి డిప్యూటేషన్ (ఫారెన్ సర్వీసు)ను ఉపసంహరించుకుంటున్నట్లు పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కె.పద్మావతి నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రకు లేఖ రాశారు. ఆమెను వెంటనే బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని కోరారు. ప్రభుత్వం మెమో జారీ చేసినందున తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆమె కోరారు. స్పందించిన కమిషనర్ మంగళవారం సాయంత్రం రత్నావళిని విధుల నుంచి రిలీవ్ చేశారు. తదుపరి పోస్టింగ్ కోసం డీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ రిపోర్టు చేయాలని తన ఆదేశాల్లో సూచించారు. చీఫ్ మెడికల్ అధికారి బాధ్యతలను సహాయ వైద్య అధికారి కె.సురేష్‌బాబుకు అప్పగిస్తూ మంగళవారం కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. నూతన అధికారి విధుల్లో చేరే వరకు ఆయన ఇన్‌ఛార్జిగా కొనసాగుతారు.

కామన్ ఇంట్రెస్టు సంఘాలకు రుణాలివ్వండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని స్వయం సహాయక సంఘాల తరహాలోనే కామన్ ఇంట్రెస్టు గ్రూపులకు రుణ సదుపాయం కలిగించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. యూసీడీ ఉద్యోగులు, పలు బ్యాంకు శాఖల ప్రతినిధులతో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . నేషనల్ అర్బన్ లవ్లీహుడ్ మిషన్ 2.0 ద్వారా కామన్ ఇంట్రెస్టు గ్రూపులకు రుణ సాయం అందించేందుకు విశాఖపట్నంతో పాటు విజయవాడను పైలెట్ ప్రాజెక్టుగా కేంద్రం ఎంపిక చేసిందని వెల్లడించారు. వివిధ స్వయం సహాయక సంఘాల తరహాలోనే కామన్ ఇంట్రెస్టు గ్రూపులు తయారు చేసి, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చూడాలని అన్నారు. నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్, ప్రధానమంత్రి స్వానిధి పథకం కింద మంజూరైన నిధులు వెంటనే విడుదల చేయాలని, అర్హత కలిగిన వీధి విక్రయదార్లకు పెండింగ్‌లో ఉన్న రుణాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రియాంక, బ్యాంకు కో-ఆర్డినేటర్లు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

మానవ సంబంధాలతో ఒత్తిడి దూరం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): యువత సమయపాలన, స్వీయ గౌరవంతో పాటు మంచి మానవ సంబంధాలతో ఒత్తిడిని సులభంగా జయించ వచ్చని ప్రముఖ మానసిక వైద్యుడు విశాల్ ఇండ్ల తెలిపారు. స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విద్యార్థి విభాగం, సీఐఐ విజయవాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడి - నిర్వహణ అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి వల్ల రోడ్డు ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని ఎలా అధిగమించాలో సూచనలిచ్చారు. సానుకూల దృక్పథంతో ఉంటే జీవితంలో విజయాలు సొంతమవుతాయని తెలిపారు.

యూసీడీ పీవో సరెండర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ సామాజికాభివృద్ధి సంస్థ (యూసీడీ) ప్రాజెక్టు అధికారి సీహెచ్. వెంకటేశ్వర్లును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) విభాగానికి సరెండర్ చేస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సంభవించిన వరదల సమయంలో యూసీడీ పీవోకు అప్పగించిన విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం, ఆయనకు అప్పగించిన విధులు చట్టపరంగా నిర్వహించడంలో విఫలం కావడంతో పాటు, అతి కీలకమైన సమయంలో ఆయన వైఖరి సక్రమంగా లేనట్టు గుర్తించారు. మరోవైపు ప్రకృతి విపత్తుల విధుల నిర్వహణలో ఆయన విఫలమైనట్లు, ఆయన ప్రవర్తన ఉన్నతాధికారులకు ఇబ్బంది కలిగినట్లు తేలింది. పొదుపు సంఘాల మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో పాటు, ఆయన తీరు శిక్షార్హంగా ఉన్నట్టు మెప్మా అధికారులు గుర్తించి కమిషనర్‌కు నివేదిక పంపారు. ఆయా కారణాలతో యూసీడీ పీవో విధుల నుంచి ఆయన్ని తప్పించి, ఎంఏయూడీకి సరెండర్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

ఖాళీ స్థలాలు.. రోగాలకు నిలయాలు..!

విష జ్వరాలతో అల్లాడుతున్న కాలనీవాసులు

పాత రాజరాజేశ్వరిపేటలో ఇదీ పరిస్థితి

విద్యాధరపురం, న్యూస్‌టుడే

పాత రాజరాజేశ్వరిపేటలో ఖాళీ వదిలేసిన ఇళ్ల స్థలాలు ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్నాయి. ఒకవైపు డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, మరో వైపు ఆయా స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పారిశుద్ధ్య సమస్యలకు కారణమవుతున్నాయి. పగలు రాత్రి అని తేడా లేకుండా దోమలతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణంతో అధిక శాతం మంది రోగాలతో బాధపడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పలు రకాల విష జ్వరాలతో అల్లాడుతున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో సంపాదనలో అధిక శాతం వైద్యానికి ఖర్చు చేయలేక పలువురు మానసికంగా కుంగిపోతున్నారు.



బురదమయంగా ఖాళీ స్థలం

చిన్నపాటి వర్షం కురిస్తే చాలు..

ఆయా ఖాళీ స్థలాల్లో నెలల తరబడి మురుగు నీరు తిష్ఠ వేస్తుందని నిత్యం స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్లాట్ల యజమానులు స్థానికంగా ఉండకపోవడం, వారి చిరునామాలు తెలియక పోవడంతో కార్పొరేషను అధికారులు కూడా ఏమి చేయలేక పోతున్నారు. ఇటీవల బుడమేరు వరద వచ్చినప్పుడు ఆ స్థలాల్లోని నిల్వ ఉన్న మురుగు నేటికి వదలని పరిస్థితి దాపురించింది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు వాటిలోకి నీరు చేరి పారిశుద్ధ్య పరిస్థితులు మరింత దిగజారడంపై స్థానికుల వేదన వారి మాటల్లోనే...

దోమలతో అల్లాడిపోతున్నాం



ఖాళీ ఇళ్ల స్థలాల్లో నెలల తరబడి మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దీనికి తోడు దోమలతో రాత్రులు అల్లాడిపోతున్నాం. ఆ ఇళ్ల స్థలాలను గుర్తించి వాటి యజమానులకు మెరక చేయమని నోటీసులు ఇవ్వాలి. నగర శివారు ప్రాంతం కావడంతో కార్పొరేషను అధికారులు వీటిపైన దృష్టి సారించాలి. **-అజాం, స్థానికుడు**

పారిశుద్ధ్యం మెరుగు పరచండి



ఖాళీ ఇంటి స్థలాల కారణంగా పారిశుద్ధ్యం సమస్యలు వచ్చి చుట్టు పక్కల వారు అనారోగ్యం పాలవుతున్నారు. బుడమేరు వరద వచ్చినప్పుడు పాత రాజరాజేశ్వరిపేటలో ఏడు అడుగుల మేర నీరు నిలిచింది. ఇప్పటికి తడిసి పోయిన దుస్తులు, మంచాలు, బల్లలు, పరుపులతో పరిస్థితి దారుణంగా ఉంది. వరద బాధితులకు సాయం కూడా అందలేదు. వీటికి తోడు అనారోగ్యం పాలైతే తమలాంటి మధ్యతరగతి వర్గాల జీవనం ప్రశ్నార్థకంగా మారుతోంది.

-వెంకటేశ్వరరావు, స్థానికుడు

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), డి.శ్రీనివాసరావు (కృష్ణా) తెలిపారు. ఈ నెల 16న పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్‌లో అండర్-17 బాలబాలికల వాలీబాల్, 17న అండర్-14 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 18న నున్నలోని జడ్పీహెచ్ స్కూల్‌లో అండర్-14, 17 బాలబాలికల చెస్ జట్ల ఎంపికలు, 20న అండర్-14, 17 బాలబాలికల సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు తగు ధ్రువ పత్రాలతో సంబంధిత ప్రాంతాల్లో హాజరవ్వాలని సూచించారు.

వేతన చట్టం అమలు చేయాలి

చిట్టినగర్, న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ నెల 24న గాంధీనగర్‌లో జరిగే నగర మహాసభ విజయవంతం చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్కిల్- 1 కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించి తగు న్యాయం చేయాలని ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చేందుకు మహాసభలో పలు నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షులు ఆంజనేయులు, రాజా, జేమ్స్, ప్రభుతాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

అధికారుల సీనియారిటీ జాబితా సరి చేయాలి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రవాణా శాఖ జోన్-3లో ఎస్సీ, ఎస్టీ అడ్మినిస్ట్రేటివ్ సీనియారిటీ జాబితాను తక్షణమే సరిచేయాలని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న జారీ చేసిన ఉత్తర్వులను ఎస్సీ, ఎస్టీ అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. సీనియర్, సాధారణ అధికారుల సీనియారిటీని తిరిగి తెస్తున్నట్లు పేర్కొనడం చట్ట వ్యతిరేకమన్నారు. దశాబ్దాల పాటు పోరాటాలతో సాధించుకున్న రాజ్యాంగ సవరణలు (77, 85), కీలకమైన నాగరాజ్, జర్నైల్ తీర్పులు ఎస్సీ, ఎస్టీ అధికారుల సీనియారిటీకి హక్కులు కల్పించాయని గుర్తు చేశారు. ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపుతున్న రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సింగ్, జేటీసీ రమ్యశ్రీలను వెంటనే విధుల నుంచి తప్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే పదోన్నతుల్లో క్యాచ్‌అప్ రూల్స్ అమలును నిలిపివేయాలని, రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రను ఆపివేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మధు, దాసరి చెన్నకేశవులు, ఆంధ్ర మాల్యాద్రి, శ్యామ్‌కుమార్, ఎన్.మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు



ఐక్యత చాటుతున్న సుదర్శనం, మధు, చెన్నకేశవులు, మాల్యాద్రి తదితరులు

లోన్ యాప్ పేరుతో మోసం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఫ్యాన్సీ దుకాణం మీద రుణం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన ఘటనపై వన్‌టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జునపేటకు చెందిన లక్ష్మికి ఫ్యాన్సీ దుకాణం ఉంది. తెలంగాణకు చెందిన పవన్ అనే వ్యక్తి సెప్టెంబరు 6న షాపు వద్దకు వచ్చి రూ.2 లక్షలు లోను వస్తుందని చెప్పి యాప్‌లో దరఖాస్తు చేశారు. వెంటనే రూ.1,90,000 బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. మీ బ్యాంకు లావాదేవీలు బాగా ఉన్నాయి. మీకు రూ.5 లక్షల వరకు రుణం వస్తోందని చెప్పగా ఆమె నమ్మారు. ఈ నేపథ్యంలో పవన్ పలు దఫాలుగా రూ.90 వేలు, 11న రెండు సార్లుగా రూ.90 వేలు నగదును తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. తర్వాత మీకు రూ.5 లక్షలు లోను వస్తుందని చెప్పి మభ్య పెట్టాడు. లోను రాకపోవడంతో సదరు ఫోన్ యాప్ నిర్వాహకులను సంప్రదించగా పవన్ అనే వ్యక్తి గతంలో తమ సంస్థకు ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశాడని అతడు ఖాతాదారుల మోసం చేస్తున్నడని ఆరోపణలు రావడంతో ఉద్యోగం నుంచి తొలగించామని సమాధానం చెప్పారు. దీంతో మోసపోయినట్లు గ్రహించి బాధితురాలు తమకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై రమ్యశ్రీ సత్య ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో స్టీరియో డెక్‌లు, బ్యాటరీలు చోరీ

చిట్టినగర్, న్యూస్‌టుడే

ఆటోలలో బ్యాటరీలు, స్టీరియో డెక్‌లు, టైర్లు చోరీకి గురికావడంతో ఆటో డ్రైవర్లు బెంబేలెత్తి పోతున్నారు. బ్లేడు, గంజాయి బ్యాచ్ చోరీకి పాల్పడుతున్నారా, లేదంటే కొందరు మెకానిక్‌ల పనేనా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సౌమ్య థియేటర్ పక్కన సాయిబాబు అనే వ్యక్తి ఈ నెల 13న ఉదయం ఆటో పార్కింగ్ చేశాడు. సాయంత్రం 4 గంటలకు దాన్ని తీద్దామని చూస్తే అందులోని స్టీరియో టెక్‌లు, బ్యాటరీ కనిపించ లేదు. పట్టపగలే ఎవరో మాయం చేశారు. పరిశీలిస్తే చక్కగా టూల్స్‌తో ఊడదీసి తీసుకెళ్లినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అదే రోజున సాయిరాం థియేటర్ ఎదురుగా ఎమ్మార్ లక్ష్మణరావు వీధిలో వెంకటేష్ అనే ఆటో డ్రైవర్ తన ఆటోను పార్కింగ్ చేశాడు. సాయంత్రం చూస్తే స్టీరియో టెక్, స్పీకర్లు మాయమయ్యాయి. ఇటీవల సౌమ్య థియేటర్ వీధిలో ఓ ఆటో టైర్లు ఊడదీసుకుని గుర్తు తెలియని వ్యక్తి వెళ్లే సమయంలో ఎవరూ అని అక్కడి వారు ప్రశ్నించగా టైర్లు వదిలి వెళ్లిన ఘటనలు ఉన్నాయి. స్టీరియోడెక్‌లు, బ్యాటరీలు పోయాయని కొత్తపేట నేర విభాగం పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు బాధితులు తెలిపారు.

★ ఈ విషయమై నేర విభాగం ఎస్సై రాజా నరేంద్రను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వీటిపై ఫిర్యాదులు అందాయని కేసు నమోదు చేయలేదని, నిందితుల కోసం వెతుకుతున్నట్లు చెప్పారు.

నైపుణ్యాల మెరుగుకే పోటీల నిర్వహణ

లబ్బీపేట(విజయవాడ సిటీ): సిద్ధార్థ మహిళా కళాశాలలో 'అద్వితీయ 2024' పేరుతో ఇంటర్ కాలేజియేట్ అకడమిక్ పోటీలు ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో కార్యక్రమం గోడప్రతులను ప్రిన్సిపల్ ఎస్.కల్పన మంగళవారం ఆవిష్కరించారు.

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

63036 11232

పూడిక తొలగింపు

స్పందనకు వందనం

సీతారాంపురం, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్ నగర్ పీఎన్‌టీ కాలనీ యార్డు రోడ్డులో వరదల తర్వాత సైడు కాల్వలో పూడిక తీయలేదు. దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఈ నెల 9న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. అధికారి వి.రామ కోటేశ్వరరావు స్పందించారు. సైడు కాల్వలో పూడిక తీయించారు. దోమల నివారణ మందు పిచికారి చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



అనస్తీషియాపై అవగాహన

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : అనస్తీషియాపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలని ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీయాలజిస్ట్స్ రాష్ట్ర అకడమిక్ ఛైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ పేర్కొన్నారు. అక్టోబరు 16న వరల్డ్ అనస్తీషియా డే సందర్భంగా ఐ.ఎం.ఎ. హాలులో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన గవర్నర్‌పేటలో విలేకరులతో మాట్లాడారు. శస్త్రచికిత్సల్లో అనస్తీషియా అంటే ప్రజలు భయపడుతుంటారని, వాటిని తొలగించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. సీపీఆర్‌పై వారికి అవగాహన కలిగిస్తున్నామని వివరించారు. బుధవారం సాయంత్రం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో నిర్వహించే ఈ కార్యక్రమంలో అనస్తీషియా వైద్యులు పాల్గొంటారని ఆయన వివరించారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 16వ తేదీ నుంచి పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), డి.శ్రీనివాసరావు (కృష్ణా) తెలిపారు. ఈ నెల 16న పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్‌లో అండర్-17 బాలబాలికల వాలీబాల్, 17న అండర్-14 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 18న నున్నలోని జడ్పీహెచ్ స్కూల్‌లో అండర్-14, 17 బాలబాలికల చెస్ జట్ల ఎంపికలు, 20న అండర్-14, 17 బాలబాలికల సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు.



ఉద్యానం నిర్మిత ప్రాంతం ఇలా..



మధ్యగా వెళుతున్న పెద్దకాలువ



వాకింగ్ ట్రాక్, పిల్లర్ల నిర్మాణం

వరద ఊడ్చేసింది..!

బుడమేరు వరద ధాటికి ఎన్నో ప్రాంతాలు, ఉద్యానాలు అతీగతీలేకుండా మారాయి. విజయవాడ దేవీనగర్ ప్రాంతంలో బుడమేరు కాలువ గట్టు ఆక్రమణలకు గురైంది. వాటిని తొలగించి పార్కు, వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్దాలని నగర పాలక సంస్థ పనులు ప్రారంభించింది. ప్రహరీ నిర్మాణం మొదలు పెట్టింది. ఇటీవల ఆకస్మికంగా ముంచెత్తిన బుడమేరు వరద ధాటికి ఉద్యానం చెత్తాచెదారంతో నిండిపోయింది. ఎక్కడ చూసినా వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. పార్కు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

- ఈనాడు, అమరావతి



సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ (పాత చిత్రం)



మూతపడి ఇలా..

కళలకు ప్రోత్సాహం కరవు..!

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే కాకుండా పరిసర జిల్లాలలో ఎక్కడా లేని విధంగా విజయవాడ నగరంలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల నిర్వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇక్కడి కళావేదిక వెలవెలబోతోంది. సుమారు నాలుగు ఎకరాల సువిశాల ప్రాంగణంలో గోకరాజు లైలా గంగరాజు పేరుతో దాత గోకరాజు గంగరాజు ఈ కళావేదికను నిర్మించారు. దీనిని 2003 సంవత్సరంలో దివంగత గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. గత 20 ఏళ్లలో వందలాది మంది కళాకారులు తమ ప్రదర్శనలతో నగరవాసులను అలరించారు. వేలాది నృత్యప్రదర్శనలు చేశారు. నాటకాలు, సంగీత కచేరీలు వందలాదిగా నిర్వహించారు.

వైకాపా పాలనలో నిర్లక్ష్యం..

కళావేదికపై నిర్వహించే కార్యక్రమాలతో మైక శబ్దం ఎక్కువగా వస్తోందని ఒకరిద్దరు స్థానికులు.. కోర్టులో కేసులు వేశారు. కొన్ని సంవత్సరాలుగా కేసులు నడుస్తున్నాయి. నిర్వాహకులు మైకుల శబ్దం తగ్గించి కార్యక్రమాలు నిర్వహించేవారు. వైకాపా పాలనలో కళా, సాంస్కృతిక రంగాలను పూర్తిగా నాశనం చేశారని పలువురు కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి.. కళారంగ అభివృద్ధికి కృషిచేయాలని వారు కోరుతున్నారు.

దేశాభివృద్ధిలో రతన్ కీలకం

విజయవాడ [illegible], న్యూస్‌టుడే : దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన రతన్‌టాటా మరణం తీరని లోటని బీబీఏ కార్యవర్గం పేర్కొంది. దేశం ఒక గొప్ప వ్యాపారవేత్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం బీబీఏ హాల్లో రతన్‌టాటాకు ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామ్‌ప్రసాద్‌లు మాట్లాడుతూ.. రతన్‌టాటా ముందు చూపుతో 100 సంవత్సరాల భవిష్యత్తును ముందే అధ్యయనం చేసి దేశాభివృద్ధికి కావాల్సిన పారిశ్రామిక ఉత్పత్తులను అందించారని కొనియాడారు. టాటా గ్రూప్ వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన రతన్‌టాటా.. అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో సంపర శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఒగ్గు గవాస్కర్, అల్లం పద్మనాభం, రమేష్, ఎన్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రమౌళి, శివరామప్రసాద్ తదితరులు

వారధిపై నిలిచిన వాహనాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే : గుంటూరు వైపు నుంచి విజయవాడ వైపునకు వచ్చే కనకదుర్గమ్మ వారధిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు నరకాన్ని చూశారు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో వారధి పైకి వచ్చిన ట్రావెల్స్ బస్సు మరమ్మతులకు లోనై నిలిచిపోయింది. బస్సును అక్కడ నుంచి తొలగించకపోవడంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రెండు గంటల సమయం పట్టింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించండి

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : పట్టభద్రులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా సెంట్రల్ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, వివిధ సంఘాల నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్క ఇంట్లోనూ పట్టభద్రులు ఉంటారని, వారి పేర్లను నమోదు చేయించాలని కోరారు. గతంలో నమోదు చేసుకున్న వారు కూడా తాజాగా నమోదు చేసుకోవాలనే విషయాన్ని తెలియజేయాలని సూచించారు. నవంబరు 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. తెదేపా అభ్యర్థికి ఓటు వేసి కూటమి ప్రభుత్వానికి విజయం సాధించి పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజాను అందరికీ పరిచయం చేశారు. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త బొలిశెట్టి వంశీకృష్ణ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, భాజపా సెంట్రల్ నియోజకవర్గ కన్వీనర్ నామిశెట్టి వెంకట్ పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బొండా ఉమామహేశ్వరరావు, ఆలపాటి రాజా

యూసీడీ పీవో సరెండర్


విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ సామాజికాభివృద్ధి సంస్థ (యూసీడీ) ప్రాజెక్టు అధికారి సీహెచ్.వెంకటేశ్వర్లును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) విభాగానికి సరెండర్ చేస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సంభవించిన వరదల సమయంలో యూసీడీ పీవోకు అప్పగించిన విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం, ఆయనకు అప్పగించిన విధులు చట్టపరంగా నిర్వహించడంలో విఫలం కావడంతో పాటు, అతి కీలకమైన సమయంలో ఆయన వైఖరి సక్రమంగా లేనట్టు గుర్తించారు. మరోవైపు ప్రకృతి విపత్తుల విధుల నిర్వహణలో ఆయన విఫలమైనట్లు, ఆయన ప్రవర్తన ఉన్నతాధికారులకు ఇబ్బంది కలిగినట్లు తేలింది. పొదుపు సంఘాల మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో పాటు, ఆయన తీరు శిక్షార్హంగా ఉన్నట్టు మెప్మా అధికారులు గుర్తించి కమిషనర్‌కు నివేదిక పంపారు. ఆయా కారణాలతో యూసీడీ పీవో విధుల నుంచి ఆయన్ని తప్పించి, ఎంఏయూడీకి సరెండర్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

18న ఎంబీవీకే భవన్‌లో రాష్ట్ర సదస్సు

విజయవాడ(గాంధీనగర్): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 18వ తేదీన మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు దాది శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఎంబీవీకే భవన్‌లో సదస్సు గోడపత్రిక ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో పాటు న్యాయ చట్టాల పేరు మార్పు మాటున ప్రజా వ్యతిరేక చట్టాలను రూపకల్పన చేశారని విమర్శించారు. రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో భర్తీచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు డి.శ్రీధర్‌బాబు, రఫీ, యాదగిరి, సుబ్బారావు, వలి పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, రఫీ, యాదగిరి



ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన సహజసిద్ధ సాగు క్షేత్రం



పురుగు పట్టిన గోంగూర



ఎండిపోయిన పంట



తెగుళ్లబారిన వంకాయలు



మిరప ఇలా..

ప్రయోగానికి తెగుళ్లు..!

ఎన్టీఆర్ కలెక్టరేట్ ఆవరణలోని తక్కువ స్థలంలో ఎక్కువ కూరగాయలు ఉత్పత్తి చేసే నూతన విధానానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఎలాంటి పురుగు మందులు వాడకుండా పంటలు పండించేలా ప్రయోగాత్మకంగా సాగు చేశారు. అయిదు నెలల కిందట జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రైతులను తీసుకొచ్చి.. డెమో ఇచ్చారు. ఆ తర్వాత అధికారులు పర్యవేక్షణ మరిచారు. బెండ, వంకాయ, మిరప మొక్కలకు తెగుళ్లు సోకాయి. పురుగుపట్టి పాడైపోయాయి. లక్ష్యం నీరుగారిపతోంది.

– ఈనాడు, అమరావతి

అదృశ్యమైన యువకుడు.. శవమై తేలాడు

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు.. శవమై తేలిన ఘటన నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. న్యూరాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ సుల్తాన్ (23) కానూరులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ మధ్యలోనే మానేశారు. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఇంట్లో చెప్పి.. బయటకు వెళ్లారు. అర్ధరాత్రి అయినా తిరిగిక రాకపోవటంతో.. స్నేహితుడి ఇంటికి వెళ్లి ఉంటారని ఊరుకున్నారు. సోమవారం ఉదయమైనా రాకపోవడంతో చరవాణికి ఫోన్ చేయగా.. ఎత్తలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో ఆరా తీశారు. ఎక్కడా ఆచూకీ తెలియరాలేదు. తండ్రి సుభానీ సోమవారం సాయంత్రం నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం ఉదయం కండ్రిక కూడలి నుంచి రామవరప్పాడు రింగ్ వైపు వెళ్లే రహదారిలోని మురుగు కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. సీఐ కృష్ణమోహన్ వెళ్లి పరిశీలించారు. అప్పటికే మిస్సింగ్ కేసు ఉండడంతో.. ఫిర్యాది సుభాన్‌ను పిలిపించారు. ఆయన వచ్చి.. మృతదేహం తన కుమారుడిదేనని నిర్ధారించారు. ఈ ఘటనతో బంధువులంతా కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహం లభ్యమైన ప్రదేశానికి కొద్ది దూరంలో ద్విచక్రవాహనం కనిపించింది. రాత్రి వెళుతూ.. ప్రమాదవశాత్తు కాలువలోకి దూసుకుపోయి ఉంటారని పోలీసులు భావించారు. బురదలో కూరుకుపోయి మరణించి ఉంటారని, రోజున్నర కావడంతో మృతదేహం నీటిపై తేలి ఉంటుందని అంచనాకు వచ్చారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాలువ అంచులో ద్విచక్ర వాహనం

ఖాతాదారులకు రూ.10ల నాణేలు

మధురానగర్, న్యూస్‌టుడే : రూ.10ల నాణేలు చెల్లుబాటు అవుతాయని, ఎలాంటి అపోహలకు గురికావద్దని యూనియన్ బ్యాంకు విజయవాడ రీజియన్ డిప్యూటీ హెడ్ హరీష్ బేత పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంకు సూచనల మేరకు మధురానగర్ శాఖలో మంగళవారం ఆయన ఖాతాదారులకు రూ.10ల నాణేలు పంపిణీ చేశారు. రూ.10లు చెల్లవనడం సరికాదన్నారు. గతంలో ఎవరూ తీసుకునే వారు కాదని, ఇపుడు వారిలో మార్పు వచ్చిందన్నారు. ప్రజలంతా ఈ నాణేలను స్వీకరిస్తున్నారని చెప్పారు. దీనిపై మరింత అవగాహన కలిగించేందుకు నాణేలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. నగరంలోని అన్ని యూనియన్ బ్యాంకు శాఖల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



మహిళకు నాణేలు అందిస్తున్న హరీష్

సీఎంవోహెచ్ డిప్యుటేషన్ ఉపసంహరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో చీఫ్ మెడికల్ ఆరోగ్య అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.రత్నావళి డిప్యూటేషన్ (ఫారెన్ సర్వీసు)ను ఉపసంహరించుకుంటున్నట్లు పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కె.పద్మావతి నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రకు లేఖ రాశారు. ఆమెను వెంటనే బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని కోరారు. ప్రభుత్వం మెమో జారీ చేసినందున తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆమె కోరారు. స్పందించిన కమిషనర్ మంగళవారం సాయంత్రం రత్నావళిని విధుల నుంచి రిలీవ్ చేశారు. తదుపరి పోస్టింగ్ కోసం డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూకు రిపోర్టు చేయాలని తన ఆదేశాల్లో సూచించారు. చీఫ్ మెడికల్ అధికారి బాధ్యతలను సహాయ వైద్య అధికారి కె.సురేష్‌బాబుకు అప్పగిస్తూ మంగళవారం కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. నూతన అధికారి విధుల్లో చేరే వరకు ఆయన ఇన్‌ఛార్జిగా కొనసాగుతారు.

అధికారుల సీనియారిటీ జాబితా సరిచేయాలి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రవాణా శాఖ జోన్-3లో ఎస్సీ, ఎస్టీ అడ్మినిస్ట్రేటివ్ సీనియారిటీ జాబితాను తక్షణమే సరిచేయాలని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న జారీ చేసిన ఉత్తర్వులను ఎస్సీ, ఎస్టీ అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. సీనియర్, సాధారణ అధికారుల సీనియారిటీని తిరిగి తెస్తున్నట్లు పేర్కొనడం చట్ట వ్యతిరేకమన్నారు. దశాబ్దాల పాటు పోరాటాలతో సాధించుకున్న రాజ్యాంగ సవరణలు(77, 85), కీలకమైన నాగరాజ్, జర్నైల్ తీర్పులు ఎస్సీ, ఎస్టీ అధికారుల సీనియారిటీకి హక్కులు కల్పించాయని గుర్తు చేశారు. ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపుతున్న రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్‌సింగ్, జేటీసీ రమ్యశ్రీలను వెంటనే విధుల నుంచి తప్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే పదోన్నతుల్లో క్యాచ్ అఫ్ రూల్స్ అమలును నిలిపివేయాలని, రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రను ఆపివేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మధు, దాసరి చెన్నకేశవులు, ఆంధ్ర మాల్యాద్రి, శ్యామ్‌కుమార్, ఎన్.మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న సుదర్శనం, మధు, చెన్నకేశవులు, మాల్యాద్రి తదితరులు



రామ్మోహన గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు, రామచంద్రరావు తదితరులు



ప్రకాశ్‌నగర్‌లో షేక్ నాగుల్‌మీరా తదితరులు

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

గవర్నర్‌పేట: మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. మంగళవారం వివిధ ప్రాంతాల్లో కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. రామ్మోహన్ గ్రంథాలయంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆయన జీవితం.. నేటి యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు నరేష్ తదితరులు పాల్గొన్నారు. ❖ ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థి వికాస సంస్థ, గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు డీఈవో యు.వి.సుబ్బారావు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు. ❖ 62వ డివిజన్ ప్రకాశ్‌నగర్‌లో ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో కలాం జయంతి నిర్వహించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. షేక్ సాజిద్ ఆలీ, ఎం.డి.కాలేషా, సయ్యద్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



ఠాగూర్ గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులతో డీఈవో సుబ్బారావు

అభ్యసన వైకల్య పిల్లలను ప్రోత్సహిద్దాం



సీతన్నపేట ప్రదర్శనలో సాంబశివరావు, విజయ రామారావు, హర్దియాబేగం తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : అభ్యసన వైకల్యం గల పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకొని వారిని ప్రోత్సహించాలని సెంట్రల్ మండల విద్యాశాఖాధికారులు డి.సాంబశివరావు, యు.విజయరామారావు కోరారు. ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం అభ్యసన వైకల్యాలపై తల్లిదండ్రులు, సమాజానికి అవగాహన కల్పించేందుకు సీతన్నపేట భవిత కేంద్రం నుంచి 2కే వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభ్యసన వైకల్యాల పిల్లలు చదవడం, రాయడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. వైకల్యంతో బాధపతున్నప్పటికీ మంచి తెలివితేటలు కలిగి ఉంటారని తెలిపారు. వారి బలాలను గుర్తించి అన్ని విధాలా ప్రోత్సహించాలని సూచించారు. థామస్ అల్వా ఎడిసన్, స్టీఫెన్ హాకింగ్స్ వంటి వారు కూడా చిన్న వయసులోనే అభ్యసన వైకల్యాలతో బాధపడ్డారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎంఆర్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హర్ధియా బేగం, భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు కె.వెంకటసుధ, జె.కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : డిస్ లెక్సియా అనేది అభ్యాస వైకల్యమని, సంఖ్యల ఉచ్ఛారణలో, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది ఎదుర్కొంటారని పలువురు పేర్కొన్నారు. మంగళవారం పాయకాపురంలోని అయితా రాములు నగరపాలకసంస్థ పాఠశాలలోని భవిత సెంటరు విద్యార్థులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఉత్తర మండలం ఎంఈవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. డిస్ లెక్సియాతో బాధపడే వారి మెదడు.. చదివేటపుడు సమర్థవంతంగా పనిచేయదని చెప్పారు. పిల్లల్లో ఈ సమస్యను ఎలా గుర్తించాలో వివరించారు. వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివనారాయణ, పి.విజయ, కె.పాప తదితరులు పాల్గొన్నారు.



పాయకాపురంలో..